www.vishalabharati.com
epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్
11.07.2024
సంపుటి:2 సంచిక:268

# విశాల భారతి
తెలుగు దిన పత్రిక

## మీ కాళ్ళు మొక్కుతా
# కాస్త వేగంగా పనిచేయండి

- ప్రైవేటు కంపెనీ ప్రతినిధికి బీహార్ సీఎం నీతీశ్ కుమార్ విజ్ఞప్తి
- జేపీ గంగా పథ్' ప్రాజెక్టు పనులు త్వరగా చేయండి

**విశాలభారతి,నేషనల్ బ్యూరో :**

బిహార్‌లో ఓ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని ఓ ప్రైవేటు కంపెనీ ప్రతినిధికి బీహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. అందుకోసం అవసరమైతే ఆయన పాదాలకు నమస్కరిస్తానంటూ నితీశ్ కుమార్ ముందుకు వెళ్లారు. దీనితో అక్కడున్నవారంతా ఒక్కసారిగా



..మిగతా 2 లో




# రైతుల సూచనల మేరకు రైతు భరోసా విధివిధానాలు

- శాసనసభలోను చర్చ అనంతరం అంతిమంగా నిర్ణయం ప్రకటిస్తాం
- ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క
- నిజమైన రైతుకు భరోసా ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం
- చిన్న సన్నకారు రైతులకు చేయూతనిచ్చేలా నిర్ణయాలు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజక వర్గాల నుంచి సుమారు 500 మంది రైతులు హాజరయ్యారు. రైతు సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వివిధ రంగాలకు చెందిన బాధ్యులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రైతులు, రైతు సంఘాలు, అన్ని వర్గాల సూచనలు, ఆలోచనలు సేకరించిన తర్వాతే రైతు భరోసా పథకం విధివిధానాలు ప్రకటిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఉమ్మడి జిల్లాల వారీగా ప్రత్యేక కార్యశాలలు ఏర్పాటు చేసి అభిప్రాయాలు సేకరించి, శాసనసభలో ఒకరోజు చర్చ పెట్టిన తర్వాతే అంతిమంగా నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు. పంట పండించేందుకు రైతుకు భరోసా కల్పించేందుకు

..మిగతా 2 లో

> రాష్ట్రవ్యాప్తంగా రైతులు, రైతు సంఘాలు, ఇతర అన్ని వర్గాల సలహాలు, సూచనలు రైతు భరోసా పథకం అమలుపై స్వీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా వేదికగా తొలి కార్యశాల నిర్వహించింది. విధివిధానాల అమలుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఛైర్మన్, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్లో అభిప్రాయాలు సేకరించారు. ఈ సమావేశంలో మంత్రి వర్గ ఉపసంఘం సభ్యులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రెండు జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.



# నేషనల్ హైవే విస్తరణ వివరాలు నెలాఖరులోగా సమర్పించండి

- కలెక్టర్లకు సీఎం ఆదేశం
- భూ సేకరణలో మానవీయ కోణంతో వ్యవహరించాలి
- శాశ్వతంగా భూములు కోల్పోతున్న వారికి పరిహారం ఎక్కువగా ఇవ్వాలి
- హైదరాబాద్ -మన్నెగూడ రహదారి పనులు వీలైనంత త్వరగా ప్రారంభించాలి
- హైదరాబాద్-విజయవాడ రహదారి ఆరు వరుసల విస్తరణ పనులు వెంటనే చేపట్టాలి: మంత్రి కోమటి వెంకట్ రెడ్డి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ఈ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, అధికారులు ప్రత్యక్షంగా హాజరవ్వగా, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్నారు.కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని వివరాలు సమర్పించారు. ఈ క్రమంలోనే జాతీయ రహదారులకు భూ సేకరణ ఎందుకు జాప్యమవుతోందని కలెక్టర్లను రేవంత్ రెడ్డి ప్రశ్నించగా, రిజిస్ట్రేషన్, మార్కెట్ ధరల మధ్య భారీ వ్యత్యాసం వల్ల రైతులు ముందుకు రావడం లేదని వారు బదులిచ్చారు. భూ సేకరణలో మానవీయ కోణంతో వ్యవహరించాలని సీఎం కోరారు. రైతులకు నిబంధనల ప్రకారం ఎక్కువ పరిహారం దక్కేలా చూడాలని సూచించారు.

భూములను కోల్పోతున్న రైతులను పిలిచి కలెక్టర్లు మాట్లాడాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ, ఉత్తర భాగాలకు

..మిగతా 2 లో

> రాష్ట్రంలో జాతీయ రహదారులకు పూర్తి వివరాలు, ప్రతిపాదనలను ఈ నెలాఖరులోగా సమర్పించాలని కలెక్టర్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. నేషనల్ హైవే పనులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అవసరమైన చర్యలు చేపట్టేందుకు, మంగళవారం జరిగిన ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారుల భేటీలో లేవనెత్తిన వినతులపై బుధవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.జాతీయ రహదారుల స్థితిగతులపై సీఎం అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణలో పురోగతిపై ఆరా తీశారు. మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ కారిడార్ భూసేకరణపై ఆరా తీసిన సీఎం, ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.



# తెలంగాణ డీజీపీగా జితేందర్ నియామకం

- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన జితేందర్
- 14 నెలలపాటు డీజీపీ పదవిలో కొనసాగున్నారు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణ నూతన డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి జితేందర్‌ను నియమిస్తూ రాష్ట్ర సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డీజీపీగా ఉన్న రవి గుప్తాను హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేస్తున్నట్టు ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం నియమించిన తొలి డీజీపీగా జితేందర్ రికార్డ్ నమోదుచేసుకున్నారు. ఇప్పటి వరకు జితేందర్ డీజీపీ హోదాలోనే హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన జితేందర్, 1992 ఐపీఎస్ బ్యాచ్ అధికారి. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు ఎంపికయ్యారు. తొలుత నిర్మల్ ఏఎస్పీగా పనిచేసిన అనంతరం బెల్లంపల్లి అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తించారు. అప్పట్లో నక్సల్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న మహబూబ్‌నగర్, గుంటూరు జిల్లాల ఎస్పీగా పనిచేశారు. తర్వాత దిల్లీ సీబీఐలో, 200406 వరకు గ్రేహౌండ్స్‌లో పనిచేశారు. అనంతరం డీఐజీగా పదోన్నతి పొంది విశాఖపట్నం రేంజ్‌లో

..మిగతా 2 లో



## మిస్టర్ సూర్య'గా మారిన
# మిస్ అనసూయ

- రికార్డుల్లో జెండర్ మార్చుకున్న ఐఆర్ఎస్
- చెన్నైకి చెందిన ఐఆర్ఎస్ అధికారి అనసూయ

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

దేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా ఓ ఐఆర్ఎస్ ఆఫీసర్ ప్రభుత్వ అధికారిక రికార్డుల్లో తన జెండర్, పేరును మార్పించుకున్నారు. పుట్టుకతో మహిళగా పరిగణించిన తనను ఇకపై పురుషుడిగా గుర్తించాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖను అభ్యర్థించారు. దీంతో అన్ని అధికారిక రికార్డుల్లో మార్పులు చేసి ఇకపై ఆమెను పురుషుడిగా పరిగణిస్తున్నామని ఆర్థిక మంత్రిత్వశాఖ తెలిపింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం,

..మిగతా 2 లో

# కాంగ్రెస్ హయాంలో మళ్లీ రక్తమోడిన వర్సిటీలు

- అప్పుడు ఉద్యమ సమయంలో.. ఇప్పుడు తెలంగాణ వచ్చాక
- దమనకాండ కొనసాగిస్తూనే ఉన్నారు
- నిరుద్యోగులు, జర్నలిస్టులపై పోలీసుల దాడి హేయం
- బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమ



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ హయాంలో తెలంగాణ ఏర్పాటు కోసం చేపట్టిన ఉద్యమంలో పోలీసుల లాఠీ దెబ్బలతో రక్తమోడిన రాష్ట్రంలోని వర్సిటీలు మళ్లీ అదే కాంగ్రెస్ పాలనలో తెలంగాణ యూనివర్సిటీలు రక్తమోడాయని బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమ బుధవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో పోలీసుల దమనకాండ కనిపిస్తోందని ఆమె విరుచుకుపడ్డారు. ఉద్యోగాల కోసం, స్వరాష్ట్రం కావాలని విద్యార్థుల బలిదానాలతో తెచ్చుకున్న తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ విద్యార్థులకు అన్యాయం చేశాయని మండిపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీలో డీఎస్సీ వాయిదా కోసం పోరాటం చేస్తున్న విద్యార్థులతో పాటు, జర్నలిస్టులపై పోలీసులు చేయి చేసుకోవడాన్ని

..మిగతా 2 లో

# భారీగా ఐపీఎస్ ల బదిలీ

- 15 మంది ఐపీఎస్ ల ను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- రాచకొండ సీపీగా సుధీర్ బాబు

..మిగతా 2 లో



## రాజ్యసభ ఎంపీగా అవకాశం కల్పించాలి

- సికింద్రాబాద్ పార్లమెంట్ టికెట్ ఇస్తే గెలిచేవాడిని
- 8 సంలుగా ఎలాంటి పదవి లేకుండా ఉన్నాను
- కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతురావు

..మిగతా 2 లో

## నిరుద్యోగులను సన్నాసులని
# రేవంత్ అవమానిస్తున్నాడు

- రాహుల్ గాంధీని అశోక్‌నగర్‌లో తిప్పినప్పుడు ఎవరు సన్నాసి
- చదవు రానోళ్లు ఆందోళన చేస్తున్నారని అంటుండు
- డీఎస్సీ వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్నారు
- 25 వేలతో మెగా డీఎస్సీ వేస్తానన్న రేవంత్ వెయ్యాలి
- మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్




**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఘాటుగా స్పందించారు. విద్యార్థులను, నిరుద్యోగులను సన్నాసులని రేవంత్ రెడ్డి అవమానిస్తున్నాడు. రేవంత్ రెడ్డి నిరుద్యోగుల కోసం రాహుల్ గాంధీని తీసుకొని అశోక్ నగర్‌లో తిప్పినప్పుడు.. ఆ రోజు రాహుల్ గాంధీ సన్నాసా? రేవంత్ రెడ్డి సన్నాసా? అని గాదరి

..మిగతా 2 లో



# రైతుల సూచనల మేరకు రైతు భరోసా విధివిధానాలు

మొదటిపేజీ తరువాయి

రైతు భరోసా అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. హామీ మేరకు అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలు స్వీకరించి రైతు భరోసా పథకం అమలు చేయాలన్న ధృడ సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళుతోంది" అని ఆయన స్పష్టం చేశారు. అనంతరం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సాగు చేసే నిజమైన ప్రతి రైతుకు భరోసా ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. గతంలో జరిగిన లోపాలు, ఆర్థిక నష్టం ప్రజల కళ్లముందే ఉన్నాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో అలా కాకుండా కష్టపడి పంటలు సాగు చేసే చిన్న సన్నకారు రైతులకు చేయూతనిచ్చేలా ప్రభుత్వం నిర్ణయాలు ఉంటాయని స్పష్టం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో ఏ ప్రభుత్వ పథకం ప్రారంభించినా ప్రజల భాగస్వామ్యం లేకుండా, ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా ఏనాడు ప్రజల అభిప్రాయాలు స్వీకరించలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దుయ్యబట్టారు. కేవలం నాలుగు గోడల మధ్య నిర్ణయం తీసుకుని వాటిని ఆనాటి ప్రభుత్వం ప్రజలపై రుద్దిందని మండిపడ్డారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో అలాంటి చర్యలకు ఎంతమాత్రం తావులేదని తెలిపారు. శాసన సభ సమావేశాల్లోనే విధివిధానాలను కొలిక్కి తీసుకొచ్చి అమలు చేస్తామని స్పష్టం చేశారు.



# నేషనల్ హైవే విస్తరణ వివరాలు నెలాఖరులోగా సమర్పించండి

మొదటిపేజీ తరువాయి

ఒకే నంబరు కేటాయింపునకు అధికారులు చర్యలు చేపట్టాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్హెచ్ఏఐ త్రైపాక్షిక ఒప్పందానికి ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఆర్మూరునాగపూర్ కారిడార్లో అటవీ భూములు బదులుగా ప్రభుత్వ భూమలు కేటాయించాలని ఆయన సూచించారు.హైదరాబాద్ మన్నెగూడ రహదారి పనులు వీలైనంత త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్విజయవాడ రహదారి ఆరు వరుసల విస్తరణ పనులు వెంటనే చేపట్టాలన్నారు. కాగా ఈ విస్తరణ పనులు రెండు నెలల్లో ప్రారంభిస్తున్నట్లు ఎన్హెచ్ఏఐ ప్రాజెక్టు మెంబర్ అనిల్ చౌదరి వెల్లడించారు.మరోవైపు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఎన్హెచ్ఏఐ ఉన్నతాధికారులు, హైదరాబాద్ జూబ్లీహిల్స్లో సీఎం రేవంత్రెడ్డితో మంగళవారం సమావేశమయ్యారు. జాతీయ రహదారులకు భూ సేకరణ సహా ఇతర ఇబ్బందులను ముఖ్యమంత్రికి వివరించారు. ఆరు రహదారులను ప్రధానంగా ప్రస్తావించారు. అదేవిధంగా ఐదు జాతీయ రహదారుల నిర్మాణానికి ఎన్హెచ్ఏఐ సహకారం అవసరమని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. కాగా ఎన్హెచ్ఏఐ వినతుల సమస్యల పరిష్కార దిశగానే సీఎం సమీక్ష నిర్వహించారు.



# తెలంగాణ డీజీపీగా జితేందర్ నియామకం

మొదటిపేజీ తరువాయి

బాధ్యతలు నిర్వర్తించారు. అప్పాలో కొంతకాలం పనిచేసి ఆయన, తెలంగాణ ఉద్యమం సమయంలో వరంగల్ రేంజ్ డీఐజీగా కొనసాగారు.ఏపీ సీఐడీ, ఎంక్వయిరీ కమిషన్, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ లో బాధ్యతలు నిర్వర్తించిన అనంతరం హైదరాబాద్ కమిషనరేట్ లో ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్గా పనిచేశారు. తర్వాత తెలంగాణ శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీగా, జైళ్లశాఖ డీజీగా పనిచేశారు. ప్రస్తుతం హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ఆయన నూతన డీజీపీ గా బుదవారం నియమితులయ్యారు. కాగా ఆయన 2025 సెప్టెంబరులో పదవీవిరమణ చేయనున్నారు. దీంతో జితేందర్ 14 నెలలపాటు డీజీపీ పదవిలో కొనసాగనున్నారు.ప్రస్తుత డీజీపీ రవిగుప్తాను శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు ఎలక్షన్ కమిషన్ నియమించింది. బీఆర్ఎస్ గవర్నమెంట్లో డీజీపీగా ఉన్న అంజనీకుమార్ను క్రమశిక్షణ చర్య కింద సస్పెండ్ చేశారు. తర్వాత రవి గుప్తాను డీజీపీగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. అప్పటినుంచి ఆయనే కొనసాగుతున్నారు.

# భారీగా ఐపీఎస్ ల బదిలీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్రంలో భారీగా ఐపీఎస్ ల బదిలీ జరిగింది. ఈ క్రమంలో 15 మంది ఐపీఎస్ ల ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో శాంతిభద్రతల అదనపు డీజీపీగా మహేశ్ భగవత్, రాచకొండ పోలీస్ కమిషనర్గా సుధీర్ బాబు, హోంగార్డులు, ఆర్గనైజేషన్ అదనపు డీజీగా స్వాతి లక్రా, గ్రేహౌండ్స్ ఏడీజీగా స్టీఫెన్ రవీంద్ర బదిలీ అయ్యారు.

ప్రస్తుతం రైల్వే డీజీగా ఉన్న మహేశ్ భగవత్ను లా అండ్ ఆర్డర్ అదనపు డీజీగా నియమించింది. పోలీస్ ఆర్గనైజేషన్ అండ్ హోంగార్డ్స్ డీజీగా స్వాతి లక్రా బదిలీ అయ్యారు. పోలీస్ పర్సనల్ అదనపు డీజీగా విజయ్ కుమార్ను ప్రభుత్వం నియమించింది. అలాగే ఆయనకు అదనపు బాధ్యతలుగా పోలీసు సంక్షేమం, క్రీడల ఏడీజీగా నియమించారు. గ్రేహౌండ్స్ అండ్ ఆక్టోపస్ అదనపు డీజీగా స్టీఫెన్ రవీంద్ర, తెలంగాణ స్పెషల్ పోలీసు బెటాలియన్ అదనపు డీజీగా సంజయ్కుమార్ జైన్, రాచకొండ సీపీగా సుధీర్ బాబును నియమించింది.ప్రస్తుతం రాచకొండ సీపీగా ఉన్న తరుణ్ జోషిని ఏసీబీ డైరెక్టర్గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మల్టీజోన్ 1 ఐజీగా ఎస్ చంద్రశేఖర్, రైల్వే ఐజీగా కె.రమేశ్ నాయుడు, మల్టీజోన్ 2 ఐజీగా వి.సత్యనారాయణ, హైదరాబాద్ సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీగా రక్షితా మూర్తి, మెదక్ ఎస్పీగా ఉదయ్కుమార్ రెడ్డి, వనపర్తి ఎస్పీగా గిరిధర్, హైదరాబాద్ తూర్పు మండల డీసీపీగా బాలస్వామిని నియమించింది. నైరుతి మండల డీసీపీగా చంద్రమోహన్ను నియమిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.

# మిస్టర్ సూర్య'గా మారిన మిస్ అనసూయ

మొదటిపేజీ తరువాయి

చెన్నైకి చెందిన ఐఆర్ఎస్ అధికారి అనసూయ ప్రస్తుతం హైదరాబాద్లోని కస్టమ్స్ ఎక్సైజ్ అండ్ సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్ CESTAT చీఫ్ కమిషనర్ కార్యాలయంలో జాయింట్ కమిషనర్గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె తన పేరును అనుకతిర్ సూర్యగా, జెండర్ను మహిళకు బదులుగా పురుషుడిగా మార్చాలని ఆర్థిక మంత్రిత్వశాఖను కోరారు.

దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. "ఇటీవల మాకు ఓ విన్నపం అందింది. 2013 బ్యాచ్కు చెందిన ఐఆర్ఎస్ అధికారిణి అనసూయ ప్రస్తుతం హైదరాబాద్లోని CESTAT చీఫ్ కమిషనర్ (AR) కార్యాలయంలో జాయింట్ కమిషనర్గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె తనకు సంబంధించిన అన్ని ప్రభుత్వ అధికారిక రికార్డుల్లో తన పేరును, జెండర్ను మార్చాల్సిందిగా అభ్యర్థించారు. అన్ని అధికారిక రికార్డుల్లో మార్పులు చేసి ఇకపై ఆమెను పురుషుడిగా పరిగణిస్తున్నాం" అని స్పష్టం చేసింది. చెన్నైకి చెందిన ఐఆర్ఎస్ అధికారి అనసూయ చెన్నైలోని మద్రాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్లో బ్యాచిలర్ డిగ్రీని పూర్తి చేశారు. 2013లో చెన్నైలో అసిస్టెంట్ కమిషనర్గా తన వృత్తిని ప్రారంభించిన ఐఆర్ఎస్ అధికారి



అనసూయ 2018లో డిప్యూటీ కమిషనర్ ర్యాంక్కు పదోన్నతి పొందారు. 2023లో భోపాల్లోని నేషనల్ లా ఇన్స్టిట్యూట్ యూనివర్సిటీ నుంచి సైబర్ లా అండ్ సైబర్ ఫోరెన్సిక్స్లో పీజీ డిప్లొమా చేశారు. గత ఏడాది హైదరాబాద్లోని కస్టమ్స్ ఎక్సైజ్ అండ్ సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్ (CESTAT) చీఫ్ కమిషనర్ కార్యాలయంలో జాయింట్ కమిషనర్గా విధుల్లో చేరారు.



# మీ కాళ్ళు మొక్కుతా కాస్త వేగంగా పనిచేయండి

మొదటిపేజీ తరువాయి

అవాక్కయ్యారు. ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరీ, విజయ్కుమార్తో పాటు స్థానిక ఎంపీ రవి శంకర్ ప్రసాద్లు కూడా అదే వేదికపై ఉన్నారు.'జేపీ గంగా పథ్' ప్రాజెక్టులో భాగంగా పట్నాలోని గయా ఘాట్ నుంచి కంగన్ ఘాట్ వరకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించిన మూడో దశ పనులను బుదవారం ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వివరాలు, పురోగతిపై ఆయనకు అధికారులు వివరించారు. అయితే, వాటిపై అసంతృప్తి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి ఏడాదిలోగా పనులన్నీ పూర్తిచేయాలని నిర్మాణ సంస్థను ఆదేశించారు.

ఆ తరువాత అక్కడే ఉన్న నిర్మాణ సంస్థ ప్రతినిధిని ఉద్దేశిస్తూ, ఈ 'జేపీ గంగా పథ్' ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం కోరారు. అక్కడితో ఆగకుండా, 'కావాలంటే మీ పాదాలకు నమస్కరిస్తా. సకాలంలో పనులు పూర్తిచేయండి' అంటూ సదరు సంస్థ ప్రతినిధిని అభ్యర్థించారు. అంతేకాకుండా మరింత ముందుకు వెళ్లి అతడి చేతులు పట్టుకున్నారు నితీశ్ కుమార్. దీనితో కంగుతిన్న సదరు ప్రైవేటు సంస్థ ప్రతినిధి, 'సర్, దయుంచి అలా చేయవద్దు' అంటూ వెనక్కి వెళ్లిపోయారు. అయితే సీఎం తీరుతో ఉలిక్కిపడిన ఇతర నాయకులు, ఉన్నతాధికారులు ఒక్కసారిగా లేచి నిలబడి, ఆయన్ను నిలువరించే ప్రయత్నం చేశారు.

ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఇటీవల ఓ సీనియర్ ఐఏఎస్తోనూ ఇలాగే ప్రవర్తించారు. సర్వేలు వేగవంతం చేసి భూ వివాదాలను త్వరగా పరిష్కరించాలని కోరారు. అవసరమైతే సదరు ఐఏఎస్ అధికారి కాళ్లు మొక్కుతానని అన్నారు. తాజాగా అటువంటి ఘటనే మళ్లీ చోటుచేసుకోవడం గమనార్హం.

# విద్యుత్ సరఫరా అదాని సంస్థకు ఇవ్వొద్దు

- **బిల్లుల సేకరణ సైతం..**
- **ప్రైవేట్ సంస్థలకు ఇచ్చే యోచనలో సర్కార్**
- **ఆ కంపెనీలు లాభాలు రావాలనుకుంటాయి**
- **వినియోగదారులపై భారం మోపుతాయి**
- **నష్టాలను తగ్గించేలా పనిచేసేందుకు మేం సిద్ధం**
- **తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ**

**విశాలభారతి,హైదరాబాద్:**
విద్యుత్ సరఫరాతో పాటు కరెంట్ బిల్లుల సేకరణ అదాని సంస్థకు అప్పగించొద్దని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సీఎండీని బుధవారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్ సౌత్ సర్కిల్ లోని విద్యుత్ సరఫరా, బిల్లుల సేకరణను ప్రైవేట్ కంపెనీ అదానీ గ్రూపునకు అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పాతబస్తీకి సంబంధించిన విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అదానీ గ్రూపుతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్లు మీడియా ద్వారా సమాచారం అందిందన్నారు. దీనికి సంబంధించి, విద్యుత్ సరఫరా వ్యాపారాన్ని ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే ఆలోచన విద్యుత్ సంస్థలకు, వినియోగదారులకు ఏమాత్రం ప్రయోజనం కలిగించవని జేఏసీ నాయకులు తెలిపారు. ఈ సమస్యపై ఉద్యోగులు, ఇంజినీర్లు, ఆర్టిజన్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. అధిక విద్యుత్ సరాసరి సరఫరా, కమర్షియల్ నష్టాల సాకుతో పంపిణీ వ్యాపారాన్ని ప్రైవేటీకరణ చేయాలన్న ప్రతిపాదన ఏమాత్రం సరికాదని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు వినతిలో పేర్కొన్నారు. ప్రైవేట్ కంపెనీలు లాభాపేక్షతో వినియోగదారులపై అదనపు భారాన్ని కలిగించే విధంగా విద్యుత్ వ్యవస్థను నడుపుతాయని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో విద్యుత్ పంపిణీలో ప్రైవేటీకరణ, ఫ్రాంఛైజీ వంటి ప్రయోగాలు చేసినా ఆశించిన మేర ఫలితాలను ఇవ్వలేదన్నారు. హైదరాబాద్ సౌత్ సర్కిల్ లో అధిక నష్టాలను ప్రభుత్వం, మేనేజ్మెంట్ మద్దతుతో తగ్గించవచ్చని నాయకులు తెలిపారు. విద్యుత్ పంపిణీ సంస్థలోని సరాసరి సరఫరా, కమర్షియల్ (ఏటీసీ) నష్టాలను తగ్గించడంతో పాటు హైదరాబాద్ సౌత్ సర్కిల్ లో డిస్కంల ఆర్థిక పరిస్థితి మెరుగుపరిచేలా పనిచేసేందుకు ఇంజినీర్లు, ఉద్యోగులు, ఆర్టిజన్లు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు విద్యుత్ సరఫరా, బిల్లుల సేకరణ ప్రతిపాదనను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎస్పీడీసీఎల్ సీఎండీని కలిసిన వారిలో తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్ రావు, కోకన్వీనర్ బీసీ రెడ్డి, నాయకులు సుధాకర్ రెడ్డి, వెంకట నారాయణ రెడ్డి, సదానందం, వేణు, శ్రీనివాస్, జనప్రియ ఉన్నారు.

# మోడీ హయంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగింది

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

కాషాయ పాలకులే లక్ష్యంగా ఎస్పీ చీఫ్, ఆ పార్టీ ఎంపీ అఖిలేష్ యాదవ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. యూపీలో స్మార్ట్ సిటీని రూపొందిస్తామని బీజేపీ హామీ ఇచ్చిందనీ, కానీ వారి స్మార్ట్ సిటీలో ఎక్కడచూసినా జలమయమైన రోడ్లు, చెత్తచెదారం పేరుకుపోయిన వీధులు కనిపిస్తాయని ఎద్దేవా చేశారు. కాషాయ పాలకుల హయాంలో ఎటుచూసినా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రజల వాహనాలు లోయల్లో పడిపోతున్నాయని అన్నారు.

ఆరోగ్య సేవలు, ఆస్పత్రులు ప్రాథమిక సౌకర్యాలు లేక పడకేశాయని ఆందోళన వ్యక్తం చేశారు. అఖిలేష్ యాదవ్ బుధవారం ఇటావాలో విలేకరులతో మాట్లాడారు. యూపీలోని హథ్రాస్లో జరిగిన ఘటన కూడా అధికారుల వైఫల్యం కారణంగానే జరిగిందని ఆరోపించారు. నిరుద్యోగం విపరీతంగా పెరిగిందని, యువత ఉద్యోగాల కోసం వీధుల చుట్టూ తిరుగుతున్నారని అఖిలేష్ ఆవేదన వ్యక్తం చేశారు.మరోవైపు యూపీలో వరదల ప్రభావంతో పలు జిల్లాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా, ఫిలిబిత్, లఖింపూర్ ఖేరి జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిపై యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ బుధవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ వరదలతో 133 గ్రామాల్లో నష్టం వాటిల్లిందని, వేలాది ఎకరాల పంట దెబ్బతిన్నదని వివరించారు. వరదలపై సకాలంలో ముందుజాగ్రత్త చర్యలు చేపట్టడంతో ప్రాణ, ఆస్తి నష్టం భారీగా వాటిల్లకుండా చేయగలిగామని చెప్పుకొచ్చారు.

# కాంగ్రెస్ హయాంలో మళ్లీ రక్తమోడిన వర్సిటీలు



మొదటిపేజీ తరువాయి

తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన రూ.2 లక్షల ఉద్యోగాలు ఇవ్వకపోగా, ప్రతిపక్షంలో ఉన్నపుడు డిమాండ్ చేసిన 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ వేయకపోగా, డీఎస్సీ వాయిదా కోసం పోరాడుతున్న విద్యార్థులపై చేయి చేసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియా ప్రతినిధిని చొక్కా పట్టుకుని లాక్కెళ్లడం.., ప్రశ్నించే గొంతులపై ఉక్కుపాదం మోపడమేనని రాణిరుద్రమ తెలిపారు. నిరుద్యోగుల ఓట్ల భిక్షతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడంతో పాటు గ్రూప్ 2, 3 2 పోస్టులను పెంచాలని, డీఎస్సీని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. కవరేజ్కు వచ్చిన మీడియా ప్రతినిధులపై పోలీసుల దాడి విషయంలో హోంశాఖకు కూడా తానే మంత్రిగా సెల్ఫ్ డిక్లేర్ చేసుకున్న రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని రాణిరుద్రమ డిమాండ్ చేశారు.

# నిరుద్యోగులను సన్నాసులని రేవంత్ అవమానిస్తున్నాడు

మొదటిపేజీ తరువాయి

కిశోర్ నిలదీశారు. తెలంగాణ భవన్లో గాదరి కిశోర్ మీడియాతో మాట్లాడారు.రాష్ట్రంలో నిరుద్యోగులు డీఎస్సీ వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ పరమైన ఇబ్బందులు ఉంటే కారణాలు చెప్పి నిరుద్యోగులను ఒప్పించే ప్రయత్నం చేయాలి. అది ప్రభుత్వం బాధ్యత. అది చేయకుండా దమనకాండను సృష్టించే విధంగా తెలంగాణ ఉద్యమంలో కూడా ఉస్మానియాలోకి పోలీసులు అడుగు పెట్టలేదు. ఒక్కసారి మాత్రమే పోలీసులు చొరబడి, వికృత చర్యలకు పాల్పడితే ఆ రోజు ఉద్యమ తీవ్రతను గమనించిన హైకోర్టు జోక్యం చేసుకోని క్యాంపస్లోకి పోలీసులు వెళ్లొద్దని ఆదేశించింది. ఉద్యమ రోజులను తలదన్నే విధంగా మళ్లీ నిన్న వికృత చేష్టలతో పోలీసులు విద్యార్థులను ఇబ్బంది పెట్టారు అని గాదరి కిశోర్ పేర్కొన్నారు.టెట్ నిర్వహించిన తర్వాత 45 రోజుల సమయం ఇవ్వండి. మారిన సిలబస్ను చదవుకోవడానికి 25 రోజుల సమయం సరిపోదు. తమ ఆవేదనను అర్థం చేసుకోవాలని డీఎస్సీ అభ్యర్థులు వేడుకుంటున్నారు. దాంతో పాటు ఎస్జీటీలు పదోన్నతులు పొందడంతో మరో 9 వేల పోస్టులు ఖాళీగా ఏర్పడ్డాయి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో వేసిన 5 వేలకు మరో 6 వేలు కలిపి 11 వేలకు కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ వేసింది. ఇప్పుడు డీఎస్సీ అభ్యర్థుల డిమాండ్ ఏంటంటే.. ఎస్జీటీలు పదోన్నతులు పొందగా మిగిలిన 9 వేల పోస్టులను కలిపితే 20 వేలు అవుతాయి. 11 వేలతో మెగా డీఎస్సీ కాదు.. 20 వేలతో వేస్తే మాకు లాభం జరుగుతది అని అభ్యర్థులు అంటున్నారు. 25 వేలతో మెగా డీఎస్సీ వేస్తానని చెప్పిన రేవంత్.. ఇప్పుడు 20 వేలతో మెగా డీఎస్సీ వేయొచ్చు కదా..? అని గాదరి కిశోర్ నిలదీశారు.



నిరుద్యోగులను అవహేళన చేసుకుంటూ అసభ్యకరంగా మాట్లాడారు రేవంత్ రెడ్డి. మొన్న ఓయూలో వందల మందిని అరెస్టు చేసి కరెంట్ తీసేసి చిత్రహింసలు పెట్టారు. ప్రజా పాలన అని మాట్లాడే రేవంత్ ఏం చేస్తున్నాడు. రేపట్నుంచి హాల్ టికెట్ ఇస్తామంటున్నారు.. ఎందుకంటే ఉద్యోగాలు అమ్ముకున్నాడు. ఫిక్స్ అయిపోయింది. వాయిదా వేస్తే ఇబ్బంది అయితదని. అమ్ముకున్న ఉద్యోగాలకు వసూళ్లు చేయాలి.. కప్పం కట్టాలి కాబట్టి ఇబ్బంది అయితదని ఎట్టి పరిస్థితుల్లో నిర్వహించి తీరుతా అని రేవంత్ రెడ్డి అంటున్నారు అని కిశోర్ మండిపడ్డారు.

మహబూబ్నగర్లో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగులను అందర్నీ అవమానించే విధంగా సన్నాసులు వాయిదా వేయమంటున్నారు. చదవు రానోళ్లు ఆందోళన చేస్తున్నరు అని మాట్లాడుతున్నారు అవమానకరంగా. సన్నాసులట.. మరి నువ్వు నిరుద్యోగుల కోసం రాహుల్ను అశోక్నగర్లో తిప్పినప్పుడు ఎవరు సన్నాసి. నిరుద్యోగుల ఆర్తనాదాలు 9 ఏండ్ల నుంచి వినబడుతలేవా.. గ్రూప్ 1 వాయిదా వేయాలని రేవంత్ ట్వీట్ చేశారు కదా.. మరి ఎవరు సన్నాసి అని గాదరి కిశోర్ నిలదీశారు.

# రాజ్యసభ ఎంపీగా అవకాశం కల్పించాలి

- **సికింద్రాబాద్ పార్లమెంట్ టికెట్ ఇస్తే గెలిచేవాడిని**
- **- 8 సంలుగా ఎలాంటి పదవి లేకుండా ఉన్నాను**
- **కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతురావు**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు రాజ్యసభ ఎంపీగా అవకాశం కల్పించాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతురావు (వీహెచ్) అభిప్రాయపడ్డారు. గత ఎనిమిది సంవత్సరాలుగా ఎలాంటి పదవి లేకుండా ఉన్నానన్న హనుమంతరావు, సికింద్రాబాద్ ఎంపీ టికెట్ తనకు ఇచ్చి ఉంటే గెలిచేవాడినని వ్యాఖ్యానించారు. తెలంగాణ గాంధీభవన్లో మీడియాతో మాట్లాడిన వీహెచ్, టికెట్ విషయంలో తనకు అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర పర్యటనకు వస్తున్న కురియన్ కమిటీ తొలుత ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలును కలవాలన్నారు.

20 వరల్డ్ కప్ గెలిచిన ఇండియా టీమ్కు వీహెచ్ శుభాకాంక్షలు తెలిపారు. టీమ్లో సభ్యుడైన సిరాజ్ హైదరాబాద్ నివాసి అని, ఆయనకు సీఎం ఫ్లాట్, ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చారని వివరించారు. గతంలో అతని ప్రతిభను చూసి సీఎఫ్ఐ చైర్మన్గా తాను సన్మా



నించినట్లు పేర్కొన్న హనుమంతురావు, దేశంలో క్రికెట్కు మంచి క్రేజ్ ఉందని అభిప్రాయపడ్డారు.

రాష్ట్రంలో హైదరాబాద్ నగరం మినహా, ఎక్కడా క్రికెట్ స్టేడియం లేదని, ఏపీలో 12 క్రికెట్ స్టేడియాలు ఉన్నట్లు తెలిపారు. క్రికెట్ స్టేడియాల నిర్మాణానికి ప్రతి జిల్లాలో 12 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. గతంలో క్రీడలను బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ప్రోత్సహించలేదన్న ఆయన, నాడు ఎకరం భూమి కూడా కేటాయించలేదని దుయ్యబట్టారు. క్రీడలను ప్రోత్సహించాలని, అసెంబ్లీ సమావేశాల్లో క్రీడలకు బడ్జెట్లో ఎక్కువ నిధులు కూడా కేటాయించాలని కోరారు. అదేవిధంగా రైతు రుణమాఫీ చేస్తున్న రేవంత్రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలని వీహెచ్ తెలిపారు.









# ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ సేవలు అమోఘం

## ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్ల పంపిణీ..

## కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీరెడ్డి

**పాలకుర్తి/రాయపర్తి, విశాల భారతి:** పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తోన్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ సేవలు అమోఘమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కొనియాడారు. బుధవారం రాయపర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాటరీ వాహనాలను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీరెడ్డిలకు గ్రామస్తులు, మహిళలు బోనాలు, డప్పు చప్పుళ్ల మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం దివ్యాంగులతో మాట్లాడి వారి మంచి చెడులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీరెడ్డి మాట్లాడారు.

**'మానవ సేవే మాధవ సేవ'కు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతిరూపం.. ఎమ్మెల్యే యశస్వి రెడ్డి**

మానవ సేవే మాధవ సేవ అనే మాటకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతిరూపమని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. ప్రజా సేవ చేయాలన్న సదుద్దేశంతోనే శ్రీనివాస్ రెడ్డి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ను నెలకొల్పారని అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని, మా అభ్యర్థన మేరకు ఆయన పాలకుర్తి నియోజకవర్గం లో కూడా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ప్రజల తరపున ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు.

**దివ్యాంగుల కోసం మా ప్రభుత్వం పని చేస్తోంది.. హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి**

దివ్యాంగుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. త్వరలోనే దివ్యాంగులకు పెంచిన పెన్షన్ ను అందజేస్తామని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో పాలకుర్తి నియోజకవర్గాన్నిన అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. కాగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఎస్ఆర్ఆర్ సభ్యులు , బ్లాక్ అధ్యక్షుడు అమ్యా నాయక్ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి,మండల నాయకులు మాదారపు అశోక్ లను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

**సేవా గుణం కలిగిన గొప్ప వ్యక్తి శ్రీనివాస్ రెడ్డి.. కాకిరాల హరిప్రసాద్**

అనంతరం తొర్రూర్ పిఏసిఎస్ చైర్మన్, డిసిసిబి డైరెక్టర్ కాకిరాల హరి ప్రసాద్ మాట్లాడుతూ.. ధనవంతులు ఎంతోమంది ఉంటారని, ప్రజలకు సేవా చేయాలనే గుణం ఉండే వాళ్ళు మాత్రం కొంతమంది ఉంటారని అన్నారు. అలాంటి వారిలో ఝాన్సీ రెడ్డి రాజేందర్ రెడ్డి కుటుంబం ముందుంటే వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్తున్న వ్యక్తి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అని అన్నారు. పేద ప్రజల కోసం ఆయన అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. ఎర్రబెల్లి దయాకర్ రావును చిత్తుగా ఓడించి తన వారసురాలైన యశస్విని రెడ్డిని ఎమ్మెల్యేగా చేసిన గొప్ప వ్యక్తి ఝాన్సీ రెడ్డి అని కొనియాడారు.



**ఝాన్సీ రెడ్డి, యశస్వి రెడ్డిలు ఎంతోమందికి ఆదర్శం... పరుపాటి శ్రీనివాస్ రెడ్డి**

గత 30 ఏళ్లుగా హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి కుటుంబం ప్రజల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తోందని కొనియాడారు. అమెరికాలో వాళ్లకు ఎన్నో వ్యాపారాలు ఉన్నప్పటికీ సొంత గడ్డ ప్రజలకు సేవ చేయాలని వారు ఇక్కడికి వచ్చారని అన్నారు. మంచి పోరాట పటిమ కలిగిన ఝాన్సీ రెడ్డి గారు రాజకీయ ఉద్దండడు దయాకర్ రావును చిత్తుచిత్తుగా ఓడించి చరిత్ర సృష్టించారు వారిని ఎన్ని ఇబ్బందులు పెట్టినా అత్తను కాదు తల్లినని తన వారసత్వమైన కోడలు యశస్విని రెడ్డిని మన పాలకుర్తి కి ఎమ్మెల్యేగా అందించారు.సేవలో వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని తెలియజేస్తూ తాను 18 సంవత్సరాల క్రితం ఫౌండేషన్ ఏర్పాటు చేసి అందులకు,వికలాంగులకు మరియు దేవాలయాలకు అదే విధంగా ఎన్నో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేస్తున్నానని అన్నారు. యువతకు ఆదర్శంగా నిలిచిన ఝాన్సీ రెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల ముఖ్యనాయకులు, యూత్ నాయకులు, మహిళ నాయకులు, సోషల్ మీడియా నాయకులు, లబ్ధిదారులు, సంస్థ బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.







రాష్ట్ర పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు సీఎం రేవంత్ రెడ్డి నగదును బహుమతిగా అందించారు. ఒక్కొక్కరికీ రూ.25 లక్షల చొప్పున చెక్కులను సీఎం పంపిణీ చేశారు. పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గడ్డం సమ్మయ్య, దాసరి కొండప్ప, వేలు ఆనందచారి నగదును ఇచ్చారు. అలాగే పద్మశ్రీ అవార్డు గ్రహీతలు కూరేళ్ల విఠలాచార్య, కేతావత్ సోంలాల్కు సీఎం రేవంత్ రెడ్డి చెక్కులు పంపిణీ చేశారు.

# డిఎస్సీ పరీక్షను 3 నెలలు వాయిదా వేయాలి



ప్రభుత్వం డిఎస్సీ అభ్యర్థులకు ప్రిపరేషన్ కి తగిన సమయం ఇవ్వడంలో సానూకూలంగా స్పందించాలి. నిరుద్యగోలు కోరేది గొంతెమ్మ కోరికలు కాదు అధిక సిలబస్ దృష్ట్యా కొంత ప్రిపరేషన్ సమయం ఇవ్వాలని వేడుకుంటున్నారు. అసలు ఈ సమస్యకు కారణాలు 2012 సంవత్సరం లో వచ్చిన డిఎస్సీ నోటిఫికేషన్ తర్వాత మళ్లీ ఆరేండ్లకు, తెలంగాణ ఆవిర్భావం తర్వాత మూడేండ్లకు 2017 సంవత్సరంలో 8792 పోస్టులతో డిఎస్సీ స్థానం లో టిఆర్టి పేరుతో అప్పటి బి ఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది ఆ నోటిఫికేషన్లో చాలా తక్కువ పోస్టులు మరి దారుణంగా ఎస్జీటీ పోస్టులు వరంగల్0, ఖమ్మం 0, రాజన్న సిరిసిల్ల 1, జనగాం 1, వరంగల్ రూరల్ 1,ఇలా సగం పైగా జిల్లాలో ఒక అంకెకు మాత్రమే పరిమితమవడంతో నిరుద్యోగుల తీవ్రంగా నిరాశ చెందారు.మళ్ళీ ఆరేండ్లకు రెండో సారీ 09 సెప్టెంబర్2023 నాడు 5089 అరకొర పోస్టులతో డిఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ అప్పటికే బిఆర్ఎస్ ప్రభుత్వం లో గ్రూప్1 రెండు సార్లు రద్దవడం, గ్రూప్ 1,JLM,AE లాంటి పేపర్లు లీకు కావడం తో విద్యార్థులు ప్రభుత్వం పై నమ్మకం సన్నగిల్లి ప్రభుత్వ ఉద్యోగాలపై కొంత నిరాశ చెంది ప్రిపరేషన్ కొనసాగించకుండా 2023 రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ప్రధానంగా నిరుద్యోగుల ఉద్యోగ పరీక్షలను సైతం లెక్కచేయకుండా బిఆరెఎస్ ఓటమే లక్ష్యంగా పని చేసి కాంగ్రెస్ ను గెలిపించుకున్నారు.కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత నిరుద్యోగులకు మళ్ళీ ఆశలు చిగురించాయి దానికి తగ్గట్టు గానే పాత నోటిఫికేషన్ కి 6వేల పోస్టులను కలిపి మొత్తం 11062 పోస్టులతో తేది 29022024 ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. కానీ నిరుద్యగులు సిలబస్ అధికంగా ఉండటం మూలంగా కనీసం ఓ రెండు నెలలు అయినా పరీక్షను వాయిదా వెయ్యాలని ప్రభుత్వాన్ని అడుగుతున్నారు.ఆ డిమాండ్ తోనె గత 20 రోజులుగా నిరుద్యోగులు జిల్లా కేంద్రాల లో శాంతియుతంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసనలు తెలిపారు.పరీక్షల తెదీలు సమీపిస్తున్న ఆందోళనలో నిరుద్యోగులు మొదటగా TGPSC ముట్టడి, తర్వాత విద్యా శాఖ కార్యదర్శి కలవడానికి ప్రయత్నాలు చేసి అక్రమ అరెస్టులు అయ్యారు.ప్రభుత్వం మాత్రం బిఆరెఎస్ నిరుద్యోగులను ఉసిగొల్పుతుందని తప్పించుకొనే ప్రయత్నం చేస్తాఉంది.నిరుద్యోగుల ఉద్యమం అంతలా అనుమానాలు ఉంటే సమగ్రమైన ఇంటిలిజెన్స్ రిపోర్ట్ తీసుకోవాలి, విద్యార్థి సంఘాల నాయకులతో, విద్యార్థులతో చర్చలు జరపి నిరుద్యోగుల సమస్యకు పరిష్కారం చూపాలి.గత 20 రోజులుగా అభ్యర్థులు పరీక్షల పై స్పష్టత లేక మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగులతో చర్చలు జరిపి వారి సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నాం.



లెనిన్
AISF ఓయూ అధ్యక్షుడు
8142454928



## ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**శాలిగౌరారం, విశాలభారతి:** ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని,PF, ESI తదితర సౌకర్యాలతో పాటు చట్ట బద్దత కలిపించాలని డిమాండ్ చేస్తూ శాలిగౌరారం మండల ఆశా వర్కర్లు బుధవారం శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ధర్నా, ర్యాలీ నిర్వహించారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజులు తమ డిమాండ్ల సాధనకై సమ్మె చేసిన సందర్భంగా ప్రభుత్వ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ప్రవేటీకరణ చేయకుండా ఎన్ హెచ్ ఎం స్కీం లో బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. ఆశాలకు నష్టం కలిగించే 'పరీక్షను' కేంద్ర ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలన్నారు. నెలకు 10 వేల రూపాయల పెన్షన్ సౌకర్యం కలిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ పెడరేషన్ శాలిగౌరారం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బల్లెం నవనీత, రేణుక, ఉపాధ్యక్షురాలు సైదమ్మ, కార్యవర్గ సభ్యురాల్లు బి. లక్ష్మి,మాదవమ్మ,సైదమ్మ,పార్వతమ్మ,జ్యోతి,మాధవి, కవిత వివిధ గ్రామాల ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



## వారసత్వ విఆర్ఏలకు నియామక పత్రాలు అందించాలి

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి వినతిపత్రం అందజేత

**తొర్రూరు, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 3797 మంది 61 ఏళ్ల సంవత్సరాల పైబడిన వీఆర్ఏల వారసులకు ప్రభుత్వం వెంటనే నియామక పత్రాలు అందించాలని డిమాండ్ చేస్తే ఆ సంఘం నాయకులు కొండ ఉప్పలయ్య ఆధ్వర్యంలో బుధవారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత తెలంగాణ ప్రభుత్వం వీఆర్ఏలను రెగ్యులర్ చేస్తూ కారుణ్య వారసత్వ నియామకాల కోసం జీవో నెంబర్ 81 85 ప్రకారం 3797 మంది 61 సంవత్సరాలు పైబడి ఉన్న వారి వారసులకు ఉద్యోగ నియామకాల కోసం జీవోలు జారీ చేసినట్లు తెలిపారు. కానీ అట్టి జీవాలపై స్టే ఉన్నందువల్ల ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు దీంతో వారి ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ గత సంవత్సరం నవంబర్లో హైకోర్టు స్టే ఎత్తివేసినందున వెంటనే రాష్ట్రంలో ఉన్న వారసత్వ వీఆర్ఏలను నియామక పత్రాలు అందించి విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారసత్వ విఆర్ఏలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కోరగా ఎమ్మెల్యే స్పందిస్తూ మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ ,యాకన్న, కుమార్, యాకేష్ , అజయ్, తదితరులు పాల్గొన్నారు.



## చిట్యాల రైల్వేస్టేషన్లో పలు రైళ్ళని నిలపాలని డిఆర్ఎం కి వినతి

**చిట్యాల, విశాలభారతి:** చిట్యాల రైల్వే స్టేషన్ లో నారాయణాద్రి, జన్మభూమి, శబరి, డెల్టా ఎక్స్ప్రెస్ రైళ్లను ఆపాలని మరియు హైదరాబాద్ వెళ్లేందుకు లోకల్ ట్రైన్లు నడపాలని గుంటూరు డిఆర్ఎం ఎం.రామకృష్ణ కి బిజెపి నల్లగొండ జిల్లా నాయకులు వినతిపత్రం అందజేశారు. ఉదయం మధ్యాహ్నం, సాయంత్రం చిట్యాల రైల్వే స్టేషన్ లో ఆపాలని, ఉరుముడ్ల రోడ్డులో ఉన్న రైల్వే గేట్ ను తొలగించి ఫ్లైఓవర్ బ్రిడ్జి ని నిర్మించాలని, హైవే రోడ్డు నుండి రైల్వే స్టేషన్ కు వెళ్లే రోడ్డు వెంట వీధిలైట్లు వేయాలని, సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, గండమల్ల రాములు, దాసరి వెంకటేశ్వర్లు, బొప్పని హరిబాబు, చెరుకూరి బాలకృష్ణ ,నలావత్ కృష్ణా నాయక్ తదితరులు ఉన్నారు.



## గిరిజనుల పాలిట దేవుడా మారిన డాక్టర్ మధుకర్

**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లో పెనుగోలు గుట్టపై అడవిలో నివసిస్తున్న గిరిజనులకు వైద్య అధికారి మధుకర్ అధ్వరంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వాజేడు మండల కేంద్రానికి 16 కిలోమీటర్ల దూరం అయిన పెనుగోలు గ్రామానికి ఎటువంటి రహదారి సౌకర్యం లేకపోయినప్పటికీ వాగులు దాటుకుంటూ కాలినడకన వెళ్లి పెనుగోలు గుట్టపై నివసిస్తున్న గిరిజనులకు మలేరియా వైద్య పరీక్షలు నిర్వహించి, దోమల మందు పిచికారి చేయించారు. దట్టమైన అడవి ప్రాంతమైన పెనుగోలు గ్రామంలో డాక్టర్ మధుకర్ వైద్య సేవలు అందించడంతో గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆరోగ్య అధికారి మధుకర్, వైద్య సిబ్బంది చిన్న వెంకటేశ్వర్లు ,శేఖర్ రజినీకాంత్, ప్రశాంత్ , ఆశ వర్కర్ సమ్మక్క వైద్య బృందానికి తోడుగా వెళ్లిన గుమ్మడిదొడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీలు అస్తవ్యస్తం

- ప్రభుత్వం నుంచి విడుదల కాని నిధులు
- ఇబ్బందుల్లో కార్యదర్శులు




**ఆర్మూర్, విశాల భారతి.** గ్రామపంచాయతీల లో స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతుంది. పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీ లకు ప్రభుత్వం నుండి నిధులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామపంచాయతీ సిబ్బందికి గత నాలుగు నెలల నుండి జీతాలు ఇవ్వకపోవడంతో కొన్ని గ్రామపంచాయతీలలో హాజరుకావడం లేదని తెలుస్తోంది. దీనివలన గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య పనులు అస్త్యవస్తంగా మారాయి. గ్రామ పంచాయతీలకు నిధులు రాకపోవడంతో ట్రాక్టర్ కిస్తీలు, డిసిల్ లేకపోవడంతో ట్రాక్టర్ల వినియోగం తగ్గింది.

**ఇబ్బందులలో చిన్న గ్రామపంచాయతీలు**

ఆర్మూర్ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీలు ఆర్థిక భారం మోయలేని పరిస్థితులు ఉన్నాయి. చిన్న గ్రామపంచాయతీల లో ట్యాక్సీ రూపంలో వచ్చిన ఆదాయం సిబ్బందికి జీతాలకు కూడా సరిపోవడంలేదని కార్యదర్శులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చే పల్లె ప్రగతి నిధులే దిక్కుగా గ్రామపంచాయతీకి మారుతున్నాయి. పంచాయతీలకు గరిష్ఠంగా వచ్చే నిధులు ఏడాదికి రూ. 10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఉంటుంది. ఇందులో ట్రాక్టర్ కిస్తీలు, డీజిల్ ,విద్యుత్ బిల్లు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలకు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుంది. కావున అభివృద్ధి పనులు ఏ విధంగా చేయాలని కార్యదర్శులు వాపోతున్నారు.

**కిరణ్. ఎంపీ ఓ నందిపేట్ మండలం:** గ్రామపంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వడానికి ఇబ్బందిగా ఉంది. అయితే అన్ని గ్రాంట్ లలో డబ్బులు నిలువ లేవు. టాక్టర్ కిస్తీలు, డీజిల్ పోయడానికి డబ్బులు సరిపోవటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎస్ ఎఫ్ సి నిధులు, కేంద్ర ప్రభుత్వం నుండి 15వ ఆర్థిక సంఘం ఎఫ్ ఎఫ్ సి నిధులు తొందరగా మంజూరు అయితే గ్రామ పంచాయతీల పాలన సక్రమంగా కొనసాగుతుంది.



### మృతుడి కుటుంబాన్ని
## పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**దంతాలపల్లి, విశాలభారతి:** డోర్నకల్ నియోజకవర్గ దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన కొండ బుచ్చయ్య, తల్లి కొండా సోమక్క గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ తుది శ్వాస విడిచారు. ఆమె భౌతి కాయానికి పూల మాలలు వేసి డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యానాయక్ నివాళులర్పించారు. వారి వెంట మల్లయ్య, కృష్ణ, రాజయ్య తదితరులున్నారు.



## పెన్షన్ అర్హులకు అందించాలి

- పోకల వెంకటేశ్వర్లు సిపిఐ మండల కార్యదర్శి

**పాలకీడు, విశాలభారతి:** ఎన్నికల సమయంలో అధికారంలోకి రావటానికి ఆసరా పెన్షన్లు, వికలాంగులవి నెలకు ఆరువేలు, వితంతు, వృద్ధాప్య పెన్షన్స్ నాలుగు వేల రూపాయల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా ఇవ్వక పోవడం అన్యాయం అని వెంటనే ఇచ్చి హామీ ప్రకారం పెన్షన్ పైసలు పెంచి ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. గరిడేపల్లి మండల కేంద్రంలో సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా చేసి అనంతరం కార్యాలయం లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసరా పెన్షన్ కు అర్హులైన వారు చాలా మంది, మీ సేవా ద్వారా, కొంతమంది నేరుగా ఆఫీస్ లో దరఖాస్తులు సమర్పించుకొని వున్నారని,అట్టి దరఖాస్తులను పరిశీలన చేసి అర్హులైన అందరికి ఆసరా పెన్షన్స్ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, చేవ వెంకన్న,బుడిగె రమేష్,పంగ అంజయ్య, గోధుమల ఈశ్వరమ్మ, మెండే లింగయ్య, శ్రీనివాసచారీ తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

- షీ టీమ్ ఎస్ఐ సునంద

**మహబూబాబాద్,విశాలభారతి:** జిల్లా ఎస్పీ శ్రీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఐపీఎస్ ఆదేశానుసారంగా అడిషనల్ ఎస్పీ చెన్నయ్య సార్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ బాలుర కోసం మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, లో నూతన చట్టాలు సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మహబూబాబాద్ షీ టీం ఎస్ఐ సునంద సూచించారు. మహబూబాబాద్ నందు మైనారిటీ రెసిడెన్షియల్ బాయ్స్ స్కూల్ నందు షీ టీం భరోసా మరియు యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ ఇన్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో నూతన చట్టాలు నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించినారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఎస్ఐ సునంద మాట్లాడుతూ మహిళలు బాలికలపై జరుగుతున్నలైంగిక దాడులను అరికట్టాలని అన్నారు. ఏమి టీచింగ్ గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులకు వివరించారు. సోషల్ మీడియా వినియోగంలో తగు జాగ్రత్తలు వహించాలని చెప్పారు. సైబర్ నేరానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే 1930 నెంబర్ కి కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. మీకు ఎలాంటి ఆపద కలిగిన డయల్ 100 సేవలను వినియోగించుకోవాలని కోరారు. మహిళలకు గాని విద్యార్థులకు గాని ఆపదలో ఉన్నప్పుడు షీ టీం నెంబర్ అయినటువంటి 8712656935, 7901142009 నెంబర్లకు నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మరియు వారి అధ్యాపక సిబ్బంది షీ టీం స్టాఫ్ ఏఎస్ఐ ఆనందం, మరియు అరుణ, రమేష్, భరోసా, సెంట్రల్ కోఆర్డినేటర్ జోష్న, మేడం మరియు ఏ హెచ్ టి యు యూనిట్ ఉమెన్ పి సి సుప్రజా పాల్గొన్నారు.



### కస్తూర్బా గాంధీ ఎస్ఓలు
## సమయపాలన పాటించాలి

- యుఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరబాబు
- జిసిడిఓ విజయ కుమారికి వినతి పత్రం అందజేశారు

**మహబూబాబాద్, విశాలభారతి:** జిల్లావ్యాప్తంగా వివిధ మండలాల్లో కస్తూర్బా గాంధీ ఎస్ఓ లు సమయపాలన పాటించడం లేదని వీరబాబు అన్నారు. ఎస్ ఓ లు సమయపాలన పాటించకపోవడం వల్ల విద్యార్థులు విద్యకు దూరమయ్యే అవకాశం ఉందని వారు అన్నారు. ఈరోజు డీఈఓ ఆఫీస్ లో జిసిడిఓ విజయ కుమారిని కలిసి సమయపాలన పాటించని ఎస్ ఓ లని గుర్తించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని వీరబాబు అన్నారు. లేని యెడల యుఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమయపాలన పాటించని పాఠశాల ముందు రాస్తారోకో నిర్వహిస్తాం అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సందీప్, సుధీర్ కుమారు, ప్రణయ్, సన్నీ, లాలు ,నరేష్, సలీం ,శృతి, పావని, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మరిపెడ ప్రభుత్వం జూనియర్ కళాశాల సందర్శన
- ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు

**మరిపెడ, విశాలభారతి:** పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల ను సందర్శించారు. మధు మాట్లాడుతూ స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడం వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలొకి వచ్చిన స్కాలర్షిప్ ఊసే ఎత్తడం లేదు అని అన్నారు. సరైన వసతులు లేక కళాశాల వెలవెలబోతుంది అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదు అన్నారు. ప్రభుత్వం స్పందించి స్కాలర్షిప్ విడుదల చేయకపోతే ఉద్యమాలు తప్పవు అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు గందసిరి జ్యోతిబసు, జిల్లా నాయకులు వీరెందర్ ప్రకాశ్, హరీష్, మహేష్, వినయ్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు

- హెల్త్ అసిస్టెంట్ లింగం రామకృష్ణ



**కోదాడ, విశాలభారతి:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రేపాల ఆధ్వర్యంలో తాడ్వాయి గ్రామంలో స్పెషల్ డ్రైవ్ శానిటేషన్, జ్వర పీడితుల ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ లింగం రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దోమల పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలి దోమతెరలు వాడాలి, డెంగ్యూ జ్వరం వ్యాపింపజేసే దోమ. ఈ దోమ పగటి పూటలో మాత్రమే మానవులను కుడుతుంది, ఈ దోమ మంచినీళ్లలో మాత్రమే పెరుగుతుంది అని అన్నారు. ఈ దోమ రెక్కలపై తెల్లటి చారలు ఉంటాయి. డెంగ్యూ జ్వరం యొక్క లక్షణాలు తీవ్రమైన జ్వరం, అలసట, తలనొప్పి, కంటి రెప్పలు తెరవ లేకపోవడం, వాంతులు వంటివి కలిగి ఉండడం అని తెలిపారు. ఈ లక్షణాలు ఉన్న బాధితులు వెంటనే ఆరోగ్య కేంద్రానికి వచ్చి ఉచితంగా రక్త పరీక్షలు, చికిత్స చేయించుకోవాలని తెలియజేశారు. ల్యాబ్ టెక్నీషియన్ ద్వారా గ్రామంలోనే జరపీడుతుల నుండి రక్త నమునాలు సేకరించి జిల్లా లేబరేటరీ హబ్ కు పంపించారు. కార్యక్రమంలో డాక్టర్ వైష్ణవి, పబ్లిక్ హెల్త్ నర్స్ శారద, హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్ స్వాతి, ఏఎన్ఎంలు సుచరిత, మమత, ఆరోగ్య కేంద్రం ఆశ కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.




## ప్రజలకు అందుబాటులో ఉండాలి

- క్రైమ్ రేట్ తగ్గించేందుకు కృషి చేయాలి
- ఎస్పీ

**నల్లగొండ, విశాలభారతి:** పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపిఎస్ అన్నారు. నల్లగొండ జిల్లాలోని కనగల్, మునుగోడు, నాంపల్లి, చండూర్, మర్రిగూడ, గట్టుప్పల్ పోలీస్ స్టేషన్ లను సందర్శించి సిబ్బంది వివరాలు, పనితీరు, పోలీసు స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ,స్టేషన్ కేసుల స్థితిగతులు,పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు జరిగే ప్రాంతాలు, శాంతి భద్రతలు మరియు సంఘ వ్యతిరేక కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ లో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని క్రైమ్ రేటు ను మరింత తగ్గించేందుకు కృషి చేయాలని, కేసులను త్వరితగతిన పూర్తిచేసి భాదితులకు తగు న్యాయం జరిగేలా పనిచేయాలని ఆదేశించారు. ప్రతి రోజు ప్రమాదాల నివారణ కొరకు స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించాలని అన్నారు. దొంగతనాలు జరగకుండా పగలు,రాత్రి పెట్రొలింగ్ నిర్వహించాలని, సి.సి కెమెరాల ఏర్పాటు చేసుకునేలా ప్రతి గ్రామంలో ప్రధాన కూడలిలలో ప్రజలకు, వ్యాపార సముదాయాల నిర్వహులకు అవగాహన పెంచాలని, అన్ లైన్ సైబర్ నేరాల పట్ల ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ ప్రచారం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ వెంట దేవరకొండ డిఎస్పీ గిరిబాబు, చండూర్ సీఐ వెంకటయ్య,నాంపల్లి సిఐ నవీన్ కుమార్, యస్.ఐలు సురేష్,రంగారెడ్డి,వెంకటేశ్వర్లు, వెంకట్ రెడ్డి, రామకృష్ణ, లచ్చి రెడ్డి మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# పిడిఎస్ బియ్యంతో అక్రమ వ్యాపారం చేస్తే కఠిన చర్యలు

■ లబ్ధిదారులకు చేరేలా డీలర్స్, మిల్లర్స్ బాధ్యతగా ఉండాలి



**సూర్యాపేట, విశాల భారతి** జిల్లాలో పిడిఎస్ బియ్యంతో అక్రమ వ్యాపారం చేసే వారిపై, నిల్వ స్థావరాలపై జిల్లా వ్యాప్తంగా సమాచారం సేకరించి దాడులు నిర్వహిస్తున్నామని, గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా 10 కేసులు నమోదు చేసి 689 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం సీజ్ చేయడం జరిగినదని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసు విచారణలో భాగంగా ఆంధ్రా ప్రాంతంలో కూడా దర్యాప్తు చేసి పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రతి కేసులో లోతైన దర్యాప్తు చేసి పిడిఎస్ బియ్యం అక్రమ రవణాకు పాల్పడ్డ వారు ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పి.డి యాక్ట్ సైతం నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమ రవాణాను క్షేత్ర స్థాయిలో అరికట్టడానికి సంభందిత అధికారులతో సమన్వయంతో నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజా పంపిణీ వ్యవస్థ కు బియ్యం అందించే మిల్లర్లపై, అంతరాష్ట్ర ట్రాన్స్పోర్ట్ పై పోలీస్ నిఘా ఉన్నదని తెలిపారు. ప్రజా సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పక్కదారి పట్టించిన, ప్రజల ఆహార భద్రతకు భంగం కలిగించినా పీడీ యాక్ట్ చట్టం నమోదు చేస్తామని హెచ్చరించారు.



# రథశాల నిర్మాణం కోసం భూమి పూజ

**ఇందల్ వాయి విశాల భారతి :** ఇందల్ వాయి శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయం ముందు ఉన్న రథశాల నిర్మాణ కోసం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, శ్రీ సీత రామాలయ అభివృద్ధి సహాయక బృందం భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా వి డి సి చైర్మన్ జితేందర్ మాట్లాడుతూ.. మనం సంపాదించిన దాంట్లో కొంతైనా పుణ్య పనులకు ఇవ్వాలనే ఆలోచనలతో దాతలు ముందుకు వచ్చి వారికి తోచిన సహాయాన్ని అందించలని మొదటి ప్రోత్సహించిన వ్యక్తిగా ప్రధాన అర్చకులు గోపాల చారి 11 సిమెంటు బస్తాలు, ఆల్వాల్ వడ్ల భూమేశ్వర్ 100 సిమెంట్ బస్తాలు, ఇటుక కోసం 30 వేల రూపాయలు జక్కుల ప్రవీణ్, ఆవుసుల గంగాచారి 36 వేల రూపాయలు, గ్రామ అభివృద్ధి కమిటీ రథశాలకు కావల్సినంత ఇసుక,రేకుల కోసం పదిహేను వేల రూపాయలు శ్రీరామ సేవ సమితి సభ్యులు ప్రస్తుతం ఇవ్వటానికి ముందుకొచ్చారు. ఇంకా దాతలు ముందుకు వచ్చి రథశాల నిర్మాణాన్ని విజయవంతం చేయాలని గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ జితేందర్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు రామాలయం ప్రధాన అర్చకులు తదితరులు పాల్గొన్నారు.




# నేరాలు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

**బాల్కొండ, విశాల భారతి:** భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు పోలీస్ కళా బృందం వారిచే నాటిక, పాటలతో సమాజంలో జరుగతున్న నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించడం జరిగిందని ఏఎస్సై చిరంజీవులు తెలిపారు. ఈ నాటికలో యువత గంజాయి,మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని,వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మహిళల భద్రత కోసం షీ టీమ్ రక్షణ కల్పిస్తుందని తెలిపారు. అత్యవసర సమయంలో డయల్ 100 ఉపయోగించాలని, ఆన్లైన్ మోసాలు గురించి అప్రమత్తంగా ఉండాలని, గల్ఫ్ దేశాలకు వెళ్తున్న ప్రజలు, నిరుద్యోగులు నకిలీ ఏజెంట్లు తో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని,అందరూ శాంతియుతంగా అన్నదమ్ముల్లా కలిసి మెలసి ఉండాలని పోలీస్ కళా బృందం వారు నాటిక, పాటలతో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ కృష్ణ దాస్, కళాబృందం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# మస్టిన్ కులస్తుల భూమిపై దౌర్జన్యం తగదు..

**అధికారులు తమకు న్యాయం చేయాలి**

**చిగురుమామిడి, విశాల భారతి:** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రామంచ గ్రామంలో సర్వే నెంబర్ 455/30 మాస్టిన్ కులస్తులకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలిచ్చిందని మాస్టిన్ కులస్తులు దర్శనం రామదాసు, దర్శనం శంకర్, దర్శనం రాజమౌళిలు తెలిపారు. ఈ సందర్భంగా మస్టిన్ కులస్తులు మాట్లాడుతూ అట్టి భూమి ఇందిరా గాంధీ హయాంలో భూ పంపిణిలో భాగంగా తమకు అందజేసినట్లు మస్టిన్ కులస్తులు తెలిపారు. మాస్టిన్ కులస్తులు నాటి నుండి నేటి వరకు ఈ భూమిలో కస్తులో ఉంటూ పంటలు పండించుకుంటున్నామని వివరించారు. కుర్మా సామాజిక వర్గానికి చెందిన కొందరు వక్తులు సర్వే నెంబర్ 455/30లో మాకు భూమి ఉన్నదని, తప్పుడు ప్రచారామ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుర్మ సంగం పేరు చెప్పుకుంటూ కొందరు వక్తులు ములుపల కొమురయ్య, శకుంట ఐలయ్య అనే వక్తులు 10ఎకరాలు భూమి ఉన్నదని తప్పుడు ప్రచారం చేస్తూ ఎస్సీ ఉపకులలాకి చెందిన మాస్టిన్ కులస్తుల మీద దౌరజ్ఞానానికి దిగుతున్నారని రెవిన్యూ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని మస్టిన్ కులస్తులు వారికిచ్చిన పట్టా భూములు పాస్ బుక్ లను చూపిస్తూ అధికారులను కోరారు. ఈ మేరకు దర్శనం రాందాసు, దర్శనం శంకర్, దర్శనం సంపత్, రాజమౌలి,పెద్ద నర్షయ్య, నంపెల్లి, రాజయ్య తదితరులు అధికారుల్ని వేడుకుంటున్నారు.



రాచకొండ పోలీస్ కమిషనర్ గా సుధీర్ బాబు ఐపిఎస్ నియమితులయ్యారు. బుధవారం నేరేడ్మెట్ లోని రాచకొండ సిపి కార్యాలయంలో సుధీర్ బాబు ఐపిఎస్ రాచకొండ సిపిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ కోసం శక్తి వంచనా లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

# పేదింటి ఆడబిడ్డల పెద్ద కొడుకు రేవంత్

■ మహిళా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

■ కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పాలకుర్తి, విశాలభారతి:** పేదింటి ఆడబిడ్డల పెద్ద కొడుకు సీఎం రేవంత్ రెడ్డి అని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. బుధవారం పాలకుర్తి ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మొత్తం 62 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి పథకాన్ని తొలుత దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రపోజ్ చేశారని, అదే పథకాన్ని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేరుతో గత పాలకులు కొనసాగించారని అన్నారు. గత ప్రభుత్వాల నాయకులు రాజకీయ కక్ష సాధింపుతో అర్హులైన లబ్ధిదారులకు పథకాలను అడ్డుకున్నారని అన్నారు. రానున్న కాలంలో పేదల కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామని కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ప్రజల కళ్లల్లో ఆనందం చూడడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యపు పాలన వల్ల రాష్ట్ర ఖజానా భారీగా దెబ్బ తినటంతో తులం బంగారం అందించలేక పోతున్నామని, వారి దోపిడీని ఎండగట్టి పారదర్శక పాలన అందిస్తామన్నారు. రాష్ట్రంపై బీఆర్ఎస్ మోయలేని భారాన్ని వేసి ప్రజల భవిష్యత్ ను ప్రశ్నార్థకం చేసిందన్నారు. త్వరలోనే కళ్యాణ లక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం సైతం అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలతో నిరుపేదలు లబ్ధి పొందుతున్నారని, తమ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు, ఇతర అధికారులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, పార్టీ ముఖ్యనాయకులు, యూత్ నాయకులు, మహిళ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు బ్యాగ్స్, నోట్ బుక్స్ అందజేసిన దశమి ల్యాబ్స్

**చిట్యాల, విశాలభారతి:** ఆరెగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో దశమి కెమికల్ లాబరేటరీ ఆధ్వర్యంలో కంపనీ హెచ్ ఓ డి టి. సురేంద్రబాబు, హెచ్ ఆర్ లు బి. కరుణాకర్ రెడ్డి, ఎం.జగదీష్, లు విద్యార్థులకు యూనిఫార్మ్స నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్ పెన్నులు వంటి పలు సామాగ్రిని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని ఉన్నత విద్యావంతులకు ఎదగాలని మా కంపెనీ యాజమాన్యం అందించిన సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు అరుణ, విజయ సారథి, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాలను సందర్శించిన స్పెషల్ ఆఫీసర్ విష్ణువర్ధన్

**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలంలోని బాబాపూర్, లింగాపూర్, పిప్రి గ్రామాలను మండలానికి చెందిన స్పెషల్ ఆఫీసర్ విష్ణువర్ధన్ బుధవారం సందర్శించారు. ఇందులో భాగంగా పల్లె ప్రకృతి వనాలను, నర్సరీలను, అమ్మ ఆదర్శ పాఠశాలలను తనిఖీ చేశారు. నర్సరీ, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి, నాటిన మొక్కలను ఒక క్రమ పద్ధతిలో సంరక్షణ చేపట్టాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్,ఎంపీఓ గంగ మోహన్,ఉపాధి హామీ ఎపిఓ నర్సయ్య,పంచాయతీ కార్యదర్శులు,ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు



# ఆరోగ్య ఉప కేంద్రాని పరిశీలించిన ప్రభుత్వ వైద్యాధికారి

**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గం కమ్మర్ పల్లి మండలం చౌట్ పల్లి ప్రభుత్వ వైద్యాధికారి డా.సుప్రియ హాస కోత్తుర్ లోని ఆరోగ్య ఉప కేంద్రంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లలకు అందుతున్న వ్యాక్సిన్ లను, రికార్డులను ఆన్లైన్ రిపోర్టులను ఆమె పరిశీలించారు. అదే విధంగా వ్యాక్సిన్ లను తేదీల వారీగా ఇచ్చేముందు వాటి నాణ్యత ఎక్స్పైరీ డేట్ లను తప్పకుండా చూడాలని తెలిపారు. టీకాలు వేసిన తర్వాత పిల్లలను ఒక 30 నిమిషాలు పర్యవేక్షణలో ఉంచాలని ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు తెలిపారు. పిల్లలకు నెల వారీగా తప్పకుండా టీకాలు ఇవ్వాలని అదేవిధంగా తల్లిపాల ప్రాముఖ్యతను వారికి బోధించాలని ఆమె తెలిపారు. పిల్లలకు ఈ వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఏఎన్ఎం మమత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ కు బడ్జెట్ పెంచాలి

■ తహశీల్దార్ కు వినతి పత్రం అందజేత

**బాల్కొండ, విశాలభారతి:** కేంద్ర ప్రభుత్వం 2024 25 బడ్జెట్ లో ఐసిడిఎస్ కు బడ్జెట్ పెంచాలని, ఐసిడిఎస్ రక్షణ, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ కు చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని భీమ్‌గల్ సెక్టర్ ఇన్చార్జిలు ప్రమీల, గంగాలక్ష్మి అన్నారు. బుధవారం వారి డిమాండ్ లను పరిష్కరించాలని కోరుతూ భీమ్‌గల్ తహశీల్దార్ శ్రీలలిత కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో బాల్య సంరక్షణ,ప్రీ స్కూల్ విద్యా భాగాన్ని బలో పేతం చేయాలని కోరారు. అంగన్వాడీ టీచర్లను 3వ తరగతి, ఘ హెల్పర్స్ ను 4వ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించి, పెండింగ్ లో ఉన్న రెగ్యులరైజేషన్, 45వ ఐఎల్సి సిఫారసులను అమలు చేసి,కనీస వేతనం నెలకు రూ.26వేలు, పెన్షన్ నెలకు రూ.10వేలు,పిఎఫ్,ఈఎస్ఐ మొదలైన సౌకర్యాలు దేశవ్యాప్తంగా ఒకేవిధమైన నిబంధనలు ఉండాలని అన్నారు. రాష్ట్రంలో 24 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్స్ పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే పాడి కౌశిక్‌ని కలిసిన ఉప్పుల వెంకటేష్

**కల్వకుర్తి, విశాల భారతి** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాష్ట్ర మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పుల వెంకటేష్ బుధవారం ఎమ్మెల్యే నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. అనంతరం తెలంగాణలో రాజకీయ పరిస్థితులను గురించి బిఆర్ఎస్ పార్టీ చేయనున్న కార్యక్రమాల గురించి వివిధ అంశాలపై చర్చించినట్లు ఉప్పుల వెంకటేష్ తెలిపారు. ఆయనతోపాటు తలకొండపల్లి మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు గోపాల్ నాయక్ ఉన్నారు.

# ఏకలవ్య కార్పొరేషన్ చైర్మన్‌గా కూతాటి కుమార్ ను నియమించాలి

**శాలిగౌరారం, విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ మేనిఫెస్టోలో ఆరు గ్యారెంటీలలో భాగంగా ఏకలవ్య కార్పొరేషన్ ని ఏర్పాటు చేసి 500 కోట్ల రూపాయలను కేటాయించిన విషయం తెలిసిందేనని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా కార్యదర్శి సుల్తాన్ వెంకన్న అన్నారు. ఈ సందర్భంగా బుధవారం వెంకన్న మాట్లాడుతూ మేకలవ్య ఎరుకల కార్పొరేషన్ చైర్మన్ గా తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుతాటి కుమార్ ను నియమించారన్నారు. గత 30 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పనిచేస్తూ రాష్ట్రంలో ఉన్నటువంటి ఎరుకల ప్రజల సమస్యలపై గత బిఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాటం చేసినటువంటి కుమార్ కు సముచిత స్థానం ఇవ్వాలన్నారు. కరోనా టైంలో ఎంతో మంది పేదవారికి సహాయ సహకారాలు అందించినటువంటి వ్యక్తి తెలంగాణ ప్రదేశ్ ఏరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కూతాటి కుమార్ ని కార్పొరేషన్ చైర్మన్ గా నియమించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.





# ఆటో యూనియన్ లీడర్ రామ్ కుమార్‌కు ఘణ సన్మానం

**బెల్లంపల్లి విశాల భారతి** రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ అధ్యక్షులు మంద రవికుమార్, రాష్ట్ర జేఏసీ అధికార ప్రతినిధి ధారా మధు, బెల్లంపల్లి ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కట్ట రామ్ కుమార్ ని మంచిర్యాల జిల్లా ఆటో యూనియన్ల జేఏసీ అధ్యక్షులుగా నియమించినందుకు రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద ఉన్న మూడు మండలాలకు వెళ్ళు ఆటో స్టాండ్ వద్ద బెల్లంపల్లి పట్టణానికి చెందిన ఆటో యూనియన్, కమిటీ మెంబర్స్, ఆటో డ్రైవర్స్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా జేఏసీ అధ్యక్షులుగా నియమితులైన కట్ట రామ్ కుమార్ ని బెల్లంపల్లి ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్లు ముబీన్, ఎండి గౌస్ ముఖ్య సలహాదారులు బండారి శ్రీనివాస్ యాదవ్, వెంకటాపూర్ ఆటో ప్రెసిడెంట్ రాయ మల్లు, వివిధ మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు



# రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచండి

■ తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల, ఆశలు నిరసన దీక్ష

**భీమదేవరపల్లి విశాల భారతి** అంగన్ వాడీలో రిటైర్మెంట్ పొందే టీచర్లకు బెనిఫిట్స్ పెంచాలని అంగన్వాడీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్ వాడీల డిమాండ్లు పరిష్కారం కోసం నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ.. అంగన్వాడీలకు తక్షణమే రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్ కు రెండు లక్షలు, హెల్ప ర్లకు రూ.లక్ష చొప్పున ఇవ్వాలన్నారు. అలాగే వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలన్నారు. గత ప్రభుత్వం అంగన్వాడి ఉద్యోగుల సమ్మె సందర్భంగా టీచర్ కు రూ.2 లక్షలు, హెల్పర్ కు రూ. లక్ష, పెన్షన్, వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నా.. అంగన్వాడీలపై కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. పాత జీవో 10ను తెచ్చి 65 ఏళ్లు నిండిన వారిని నిరాక్ష ణ్యంగా ఇంటికి పంపాలని చూడటం దుర్మార్గం అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు రూ.26,000 ఇవ్వాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మార్వో ప్రవీణ్ కుమార్ కి అందించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.



**తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తల నిరసన:**

ఆల్ ఇండియా డిమాండ్స్ డే సందర్భంగా మండలంలోని ఆశా కార్యకర్తలు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ 26 వేల రూపాయలతో పాటు ఆన్లైన్ వర్క్ తో పెరిగిన భారాన్ని తగ్గించాలని ఆశా కార్యకర్తలు పేర్కొన్నారు. పనిభారం ఎక్కువై చనిపోయిన ఆశా కార్యకర్తలకు 50 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తా

■ పటేల్ రమేష్ రెడ్డి

**సూర్యాపేట, విశాల భారతి** ముప్పై ఏళ్ల సుదీర్ఘ కాలం పాటు తాను చేసిన ప్రజాసేవకు గుర్తింపుగా సిఎం రేవంత్ రెడ్డి తనను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా నియమించడం పట్ల టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదములు తెలిపారు. ఎటువంటి పదవులు లేనప్పటికీ సూర్యాపేట నియోజకవర్గంలో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో వుంటూ తాను నియోజకవర్గం అభివృద్ధి కోసం పనిచేశానని ఆయన చెప్పారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పటేల్ రమేష్ రెడ్డికి ఘనస్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని మెడికల్ కాలేజ్, కోర్టు చౌరస్తా, శంకర్ విలాస్ సెంటర్, ఎంజి రోడ్ మీదుగా బైక్ ర్యాలీతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ పర్యాటక శాఖ మంత్రి జూపూడి క్రష్ణారావు సహకారంతో టూరిజం కార్పోరేషన్ ద్వారా సూర్యాపేట సద్దల చెరువు అభివృద్ధికి, మూసి నది అభివృద్ధి కోసం నిధులు తీసుకుని వస్తానని చెప్పారు. ఉండ్రుగొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇంఛార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో సూర్యాపేట అభివృద్ధి కోసం నిధులు తీసుకుని వస్తానని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి సహకారంతో నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి రాజా, గట్టు శ్రీనివాస్ కౌన్సిలర్ లు షఫి ఉల్లా తదితరులు పాల్గొన్నారు.



# వారాహి నవరాత్రోత్సవములు

**సూర్యాపేట, విశాలభారతి** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషి మాత దేవాలయంలో ఆషాఢ మాసంలో విశేషమైన నవరాత్రి ఉత్సవములు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుదవారం 5వ రోజు దేవాలయ అర్చకులు భట్టరం వంశీ కృష్ణ శర్మ శ్రీ వారాహి మాత ఉత్సవ విగ్రహమునకు పంచామృత అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి షోడోపచార పూజలు నిర్వహించి మాట్లాడారు. సప్త మాతృకలో ఒకరైన శ్రీ వారాహి నవరాత్రి ఉత్సవాలు ఎక్కువగా ఉత్తర భారత దేశంలో, ముఖ్యంగా తాంత్రికులు నిర్వహిస్తుంటారు అని తెలిపారు. ఈ కార్యక్రమములో దేవాలయ కమిటీ సభ్యులు బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, భక్తులు, నూక భవాని, శివ పార్వతి, మంగ, రజనీ,విజయ లక్ష్మి, సూర్యాకల, దనలక్ష్మీ ,లీలావతి, పద్మ,కృష్ణ వేణి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



# రాఘవ రెడ్డి పదవీ బాధ్యతల స్వీకారోత్సవంలో పెద్ది కృష్ణమూర్తి గౌడ్

**దేవరుప్పుల విశాల భారతి** తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మెన్ గా జంగా రాఘవ రెడ్డి పదవీ బాధ్యతల స్వీకారోత్సవం హైద్రాబాద్ లోని బషీర్ బాగ్ లో నిర్వహించగా ఆ కార్యక్రమంలో పాల్గొన్న దేవరుప్పుల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, దేవరుప్పుల పిఏసిఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ జంగా రాఘవ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో సన్మానించారు. వారి వెంట దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాసంపెల్లి మహేందర్, తోటకూరి రమేష్, రెడ్డి రాజుల రమేష్, మండల యూత్ అధ్యక్షుడు ఉప్పుల అనిల్, తదితరులున్నారు.



# పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినిలకు ఆర్థిక సాయం

**దేవరుప్పుల విశాల భారతి** దేవరుప్పుల మండలం,కామారెడ్డి గూడెం గ్రామంలో ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో 20232024 పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థినిలకు మాజీ ఎంపీటీసీ మహ్మద్ జాకీర్, పాల కేంద్రం చైర్మన్ మహ్మద్ రసూల్ ఆర్థిక సాయం అందజేసారు. గత కొన్ని సంవత్సరాలుగా పాఠశాలలో బోధించిన ఉపాధ్యాయులు,ఉపాధ్యాయురాళ్లు పాఠశాల నుండి బదిలీ అవుతున్న సందర్భంగా వారికి వీడుకోలు తెలుపుతూ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ రాజేంద్ర కుమార్, లక్ష్మీనారాయణ,శోభారాణి,అరుణ,అన్వర్ సుల్తానా,అమ్మ ఒడి అధ్యక్షురాలు పులి పంపుల మమత,చింత నిఖిల్,సాయి నేత,సందీప్,పూర్వ విద్యార్థిని విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# రహదారులపై ఆక్రమణలను తొలగించాలి

■ ట్రాఫిక్ సవ్యంగా సాగేలా పటిష్ట చర్యలు
■ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి



**శేరిలింగంపల్లి,విశాలభారతి:**ఐటీ ప్రాంతంలో వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి స్పష్టం చేశారు.ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా రహదారులపై ఎటువంటి ఆక్రమణలున్నా తొలగించాలని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్ చందానగర్ సర్కిల్ పరిధిలోని జేఎన్‌టీయూ హైటెక్ సిటీ ఫ్లై ఓవర్ నుంచి సైబర్ టవర్స్ ఫ్లై ఓవర్ వరకు రహదారిని సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తో కలిసి జెడ్సీ ఉపేందర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు.అనంతరం స్మైల్ డెండల్ హాస్పటల్, ఎన్ కన్వెన్షన్ ప్రాంతాలలో పర్యటించారు.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఐటీ కంపెనీలకు నిత్యం లక్షలాది వాహనాల రాకపోకలు సాగిస్తున్నందున కీలకమైన ఈ రహదారిని విస్తరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా రహదారులపై నెలకొన్న ఆక్రమణల తొలగింపులపై కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు.ఎన్ కన్వెన్షన్ నుంచి స్మైల్ డెంటల్ దవాఖాన వరకు రహదారి విస్తరణకు మార్కింగ్‌ను చేపట్టాలని సూచించారు. రహదారి విస్తరణ సమయంలో చెట్లు దెబ్బతినకుండా ఇతర ప్రాంతాలకు తరలించాలని జడ్సీ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు.ట్రాఫిక్, జీహెచ్‌ఎంసీ విభాగాలు సమన్వయంతో పని చేయటం ద్వారా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు.రహదారి విస్తరణకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్థంబాలను దూరంగా తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ వంశీకృష్ణ, ఎస్ఈ శంకర్,ఈఈ రాజు, ఏసీపీ,ఇతర అధికారులున్నారు.



# ముత్తినేని వీరయ్య ప్రమాణ స్వీకారం

**చింతపల్లి విశాల భారతి** రాష్ట్ర వికలాంగుల సంక్షేమ సంఘం కార్పొరేషన్ చైర్మన్గా ముత్తినేని వీరయ్య ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. వారిని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెరికకుల కార్పొరేషన్ సాధన సమితి చైర్మన్ కోట మల్లికార్జున రావు, నల్గొండ జిల్లా పెరిక సంఘం అధ్యక్షులు ముత్తినేని శ్యామ్ సుందర్, జిల్లా గౌరవ అధ్యక్షులు అంగిరేకుల గోవర్ధన్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం, పెరిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంగిరేకుల పాండు, తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా వడ్డేపల్లి నర్సింగ్ రావు జయంతి వేడుకలు

**కూకట్ పల్లి, విశాలభారతి:**స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ్ రావు జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు. కుకట్ పల్లి , వివేకానంద నగర్ శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న వడ్డేపల్లి నర్సింగరావు గారి విగ్రహం వద్ద వారి యొక్క 72'వ జన్మదిన వేడుకలు వారి అభిమానులు ఘనంగా నిర్వహించారు, ఈ వేడుకల్లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీ.ఎన్.ఆర్ ముద్దుబిడ్డ వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని ఆయన విగ్రహానికి పుష్పాంజలి సమర్పించి ఘనంగా నివాళులర్పించారు, జోహార్ వి.ఎన్.ఆర్, అమర్ హై వి.ఎన్.ఆర్ అనే నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో శేర్లింగంపల్లి నియోజకవర్గ వి.ఎన్.ఆర్ అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, బిజెపి నాయకులు, శ్రేయోభిలాషులు, పత్రిక విలేకరులు తదితరులు పాల్గొన్నారు.



# రహదారులు పరిశుభ్రంగా ఉండాలి

■ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**రహదారులను శుభ్రం చేసే విషయంలో క్షేత్రస్థాయిలో సిబ్బంది మరింత శ్రద్ధగా పని చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి సూచించారు.వ్యర్థాలను వెను వెంటనే తొలగించాలని అందులో ఎటువంటి నిర్లక్ష్యం వద్దని స్పష్టం చేసారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో బయో డైవర్సిటీ, కొత్తగూడ కూడళ్లు, రాడిసన్ హోటల్ రోడ్, రోలింగ్ హిల్స్, మస్జీద్ బండ, కొండాపూర్, హైటెక్ సిటీ ప్రాంతాలలో జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి బుధవారం పర్యటించి పారిశుద్ధ్య పనులతో పాటు రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ కూడళ్ల నిర్వహణను మరింతగా మెరుగు పరచాలని, రహదారుల పక్కన ఇసుక మట్టి పేరుకొనకుండా ఎప్పటికపుడు శుభ్రం చేయాలని సూచించారు. సర్కిల్‌లో డీసీ స్థాయి నుంచి కింది స్థాయి వరకు పర్యవేక్షక అధికారులు రోజువారీ పారిశుధ్య పనులను పరిశీలించాలని, ఎటువంటి లోటు ఉన్నా తక్షణ సవరణ చర్యలు చేపట్టాలని జడ్సీ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తగూడ కూడలిలో ఏఎంబీ మాల్ రోడ్‌లో రహదారిపై ఉన్న ఎత్తు పల్లాలను తక్షణమే సరి చేయాలని సూచించారు. జడ్‌సీ వెంట ఇతర అధికారులు పాల్గొన్నారు.



# కమ్యూనిటీ హాల్ ను సందర్శించిన ఫతేనగర్ కార్పొరేటర్

■ పండాల సతీష్ గౌడ్

**కూకట్ పల్లి, విశాలభారతి:**ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా గాంధీ పురంలో బస్తీ దవఖానపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో 40 లక్షల నిధులతో నిర్మించుకొని పూర్తయిన కమ్యూనిటీ హాల్ భవనాన్ని పరిశీలించిన ఏ ఈ పవన్ తో పాటు కలిసి కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగాకార్పొరేటర్ మాట్లాడుతూ ఒకే హాల్లో ఉర్దూ మీడియం తెలుగు మీడియం ఉండడం వల్ల పిల్లలకి చదువుకోడానికి ఇబ్బంది కలుగుతుందని పై ఫ్లోర్ కూడా వేసి ఉర్దూ మీడియం మరియు తెలుగు మీడియం విరివిగా క్లాసులు తీసుకునే విధంగా కమ్యూనిటీ హాల్ రూములు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా బస్తీ దవాఖాన కు కూడా రోజు దాదాపు 100 మంది ప్రజలు వారు హెల్త్ చెకప్ గాని టాబ్లెట్లు కొరకు రావడం జరుగుతుందని డాక్టర్లతో చర్చించడంతో తెలిసిందని,అభివృద్ధి విషయంలో కానీ సంక్షేమ విషయంలో కానీ ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు ప్రజల కష్టాలు తీరుస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌస్ శౌకత్ ఇమ్రాన్ సలీం అన్వర్ కెసర్ అస్మత్ సంతోష్ పాల్గొన్నారు.



# చెరువులో కలుషిత నీరు చేరకుండా అడ్డుకట్ట

■ చెరువులకు పూర్వ వైభవం తీసుకొస్తా
■ కార్పొరేటర్ నాగేందర్ యాదవ్

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**శేర్లింగంపల్లి డివిజన్ పరిధిలోని చెరువులలో కలిసిన అడ్డుగడ్డ వేసి వాటి పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని చాకలి చెరువులో పెరిగిన గుర్రపు డెక్క తొలగింపు ప్రక్రియ ను కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఎంటమలజీ ఏఈ కిరణ్ తో కలిసి పరిశీలించి గుర్రపు డెక్కను తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..గుర్రపు డెక్క పెరగడం వల్ల దోమలు విపరీతంగా వృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. దోమల నివారణకు ఒకవైపు చర్యలు తీసుకుంటూనే మరోవైపు గుర్రపుడెక్క తొలిగింపు పనులను నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.దోమలు ఉత్పత్తి కాకుండా ఉండేందుకు గాను లార్వా దశలోనే నిర్మూలించేందుకు చెరువులో స్ప్రే చేయిస్తున్నామని అన్నారు. స్థానిక వాసులు పరిసర ప్రాంతలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే ఎలాంటి వైరల్ ఇన్ఫెక్షన్స్ రాకుండా నివారించవచ్చని సూచించారు. ఎంటమాలజీ అధికారులతో చర్చించి దోమల బారిన ప్రజలు చాలా ఇబ్బందులను పడుతున్నారని, వైరల్ ఇన్ఫెక్షన్స్ వచ్చే అవకాశం ఉన్నందున త్వరితగతిన గుర్రపు డెక్కను తొలగించమని ఆదేశించగా వారు స్పందించి పనులు ప్రారంభించినందుకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఎంటమాలజీ ఏఈ కిరణ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, ఎంటమాలజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటండి..సంరక్షించండి

■ భారతి నగర్ కార్పొరేట్ సింధు ఆదర్శ్ రెడ్డి



**పటాన్ చెరు, విశాలభారతి:**ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని భారతీ నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఎల్ఐజి కాలనీలో గల పార్క్ ఆవరణలో మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సింధు మాట్లాడుతూ ఖాళీ ప్రదేశాలలో వీలైనన్ని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యు.బి.డి మేనేజర్ సమీరా, ఎల్ఐజి కాలనీ ప్రెసిడెంట్ యాదగిరి రెడ్డి, డైరెక్టర్లు లక్ష్మణ్, రాంబాబు, రాజలింగం, సర్కిల్ సెక్రెటరీ భాస్కర్ ముదిరాజ్, యూత్ ప్రెసిడెంట్ నరసింహ, మైనారిటీ సెక్రటరీ గౌస్, డివిజన్ మైనారిటీ ప్రెసిడెంట్ అజీముద్దిన్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పాటి సత్యనారయణ, దేవేంద్ర చారీ, సంపత్ గౌడ్, తిలవాత్, చిన్న, శేఖర్, మైనారిటీ నాయకులు కుతుబుద్దీన్, జాకిర్, యూత్ నాయకులు రాకేష్, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# కార్మికుల హక్కులను కలరాస్తున్న బిల్లులను రద్దు చేయాలి

■ సిఐటియు కన్వీనర్ కృష్ణ

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**కార్మికుల హక్కులను కాల రాస్తున్న నాలుగు లేబర్ కోడ్ బిల్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి తాసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు.ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కొంగరి కృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మికుల హక్కులను కలరాసే విధంగా బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు రెబెల్ లేబర్ కోడ్ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు అమలు చేయాలని,సిఐటియు జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగానే కోరికల దినం అనే పేరుతో శేరిలింగంపల్లి తాహాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశామని తెలిపారు.ప్రతి రంగంలోనూ ప్రైవేటీకరణను ప్రోత్సహించి కార్మికుల హక్కులు లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయని ఆయన విమర్శించారు. గతంలో సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఇచ్చిన తీర్పును ఇప్పటివరకు అమలు చేయలేదని ఆయన గుర్తు చేశారు. వీటిపై దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తున్నామని ,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలగడం లేదని విమర్శించారు.కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే తమ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వివిధ రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిని కలిసిన కార్పొరేటర్ హమీద్ పటేల్



**శేరిలింగంపల్లి,విశాలభారతి:**శేరిలింగంపల్లి నూతన జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిని బుధవారం కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు కమిషనర్ ఉపేందర్ రెడ్డిని పూల మొక్క బహుకరించి,శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ హమీద్ పటేల్ మాట్లాడుతూ కొండాపూర్ డివిజన్ పరిధిలోని నెలకొన్న పలు సమస్యలు, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులగూర్చి వివరించారు.ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులు, ఇంకా మిగిలిన పలు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు చందానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.



## కార్మికుల శ్రమను పరిశ్రమల యాజమాన్యాలు దోచుకుంటున్నాయి

- **సీఐటీయు చందనవెళ్లి పారిశ్రామిక క్లస్టర్ కన్వినర్ అల్లి దేవేందర్**

**షాబాద్ విశాల భారతి** కార్మికుల శ్రమను పరిశ్రమల యాజమాన్యాలు దోచుకుంటున్నాయని సీఐటీయు చందనవెళ్లి పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ ఆల్లి దేవేందర్ పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని చందనవెళ్లి పారిశ్రామిక వాడలో దేశవ్యాప్తంగా కార్మికుల దినోత్సవాని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తామని ప్రకటించింది. లేబర్ కోడ్స్ వల్ల కార్మికుల 8 గంటల పని విధానం పోయి 12 గంటలకు చేరుకుందన్నారు. చందనవెళ్లి పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులతో పనులు చేయిస్తూ అతి తక్కువ వేతనాలు ఇస్తూ వారి శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. పరిశ్రమలలో ఎన్నో ప్రమాదాలు జరిగి కార్మికులకు గాయాలయ్యాయని పరిశ్రమ యాజమాన్యాలు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికశాఖ అధికారులు కార్మికుల యాజమాన్యాలతో కుమ్మక్కై కార్మికుల సంక్షేమాన్ని విస్తుదించాలన్నారు. చందనవెళ్లి పారిశ్రామిక ప్రాంతంలో ఏ కార్మికునికి అన్యాయం జరిగిన వారికి సీఐటీయు ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సేంటీయు కస్టర్ కమిటీ సభ్యులు నరసింహా, సత్తయ్య, రాములు, సాయిలు నరసింహా తదితరులున్నారు.



## రైతులను నక్షబాట నుండి వెళ్లకుండా అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**షాబాద్ విశాల భారతి** రైతులను నక్షబాట నుండి వెళ్లకుండా అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ముదెంగూడ గ్రామస్తులు తెలిపారు. బుధవారం షాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎండీ అన్వర్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామం నుండి ఎర్రోనిగూడ గ్రామానికి వెళ్లే నక్షబాబకు దారి ఇవ్వాలని గ్రామస్తులు కోరారు. ఎర్రోనిగూడ గ్రామానికి వెళ్లే దారి పక్కన ఉన్న భూమి సర్వే నెంబర్ 1490లో ఒగ్గు చిన్న యాదమ్మకు 7 ఎకరాల 38 గుంటలు, ఒగ్గు శివకుమారు 2ఎకరాల 26 గుంటలు, ఒగ్గు సంపత్కుమార్కు 2 ఎకరాల 20 గుంటల భూమి ఉంది. అయితే అదే దారి గుండా గ్రామానికి చెందిన రైతుల పొలాలు ఉన్నాయి. వారి పొలాలకు వెళ్లాలంటే ఈ నక్షబాట నుండి వెళ్లాలి. ఈ నక్షబాట నుండి వెళ్లకుండా అడ్డంగా కంచెను ఏర్పాటు వేశారని గ్రామస్థులు ఆరోపించారు. పక్క దారిలోనే స్మశాన వాటిక ఉందని, కావున నక్షటాలకు సమస్యలు లేకుండా వారిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు నర్సింహులు, సురేశ్, వెంకటయ్య, లింగం.. నర్సింహులు, సుదర్శన వెంకటేగౌర్, మల్లయ్య, రాంచంద్రయ్య, శికుమార్ తదితరులున్నారు.



## ప్రిన్సిపాల్ శైలజను సస్పెండ్ చేయాలి

**సూర్యాపేట, విశాలభారతి** సూర్యాపేట మండలం బాలేంల గ్రామం వద్ద గల అరవిందాక్ష కాలేజీలో ఉన్నటువంటి సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శైలజ విద్యార్థులకు మెనూ పాటించకపోవడం వల్ల నాణ్యమైన భోజనం అందించాలని అడిగిన విద్యార్థినిలను టార్గెట్ చేసుకోని వేధింపులకు గురిచేస్తున్న ప్రిన్సిపాల్ ను ట్రాన్స్ ఫర్ కాదు సస్పెండ్ చేయాలని విద్యార్థులు బుధవారం బాలేంల స్టేజి నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ గా వచ్చి కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ధర్నా చేస్తున్నటువంటి విద్యార్థులకు పిడిఎసుయూ విద్యార్థి సంగం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పిడిఎసుయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు సరైన వసతులు లేవని ప్రిన్సిపాల్ ని అడిగితే మీకు టీసీలు ఇచ్చి ఇంటికి పంపిస్తా అని బెదిరింపులకు గురిచేస్తున్నారని, తక్షణమే ప్రిన్సిపాల్ ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ సివో అరుణ కుమారి జిల్లాలోని గురుకుల కళాశాల, పాఠశాలల ప్రిన్సిపాల్ తో కుమ్మక్కై విద్యార్థులు చనిపోతున్న, ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా, ప్రిన్సిపాల్ లకు కొమ్ముగాస్తున్నదని, తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి ప్రిన్సిపాల్ శైలజని సస్పెండ్ చేసి ఆర్ సివో అరుణ కుమారి పై చర్యలు తీసుకొవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎసుయూ జిల్లా అధ్యక్షులు పూల్లూరి సింహాద్రి, డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్ తదితరులు పాల్గొన్నారు.



## యువత స్వయం ఉపాధి వైపు దృష్టి సారించాలి

- **ఎస్ఐ సాయిబాబు**

**భీమదేవరపల్లి విశాల భారతి** యువత చెడు మార్గం వైపు పయనించకుంట, స్వయం ఉపాధి పై దృష్టి సారించాలని ముల్కనూర్ ఎస్సై సాయిబాబు అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారి హైవేలో వెలసిన నూతన టీ స్టాల్ ను బుధవారం ప్రారంభించారు. ముందుగా కేఫ్ ఆవరణలో ఎస్సై మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతిలో నిక్షిప్తమై ఉందని, చెడు మార్గాలకు వెళ్లకుండా స్వయం ఉపాధితో ఎదగాలని యువతకు ఆయన సూచించారు. మంచి వాతావరణంలో సాయి విహార్ కేఫ్ ఏర్పాటు చేసినందుకు యజమానిని అభినందించారు. ఈ సందర్భంగా యజమాని శాలువతో ఎస్ఐని సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





## 1400 బెడ్స్ ఆసుపత్రిగా టిమ్స్ హాస్పటల్

- **వచ్చే ఏడాదిలో అందుబాటులోకి వైద్య సేవలు.**
- **ఎమ్మెల్యే శ్రీగణేష్**

**విశాలభారతి, కంటోన్మెంట్ :**కంటోన్మెంట్ నియోజకవర్గంలో టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే శ్రీ గణేష్ స్పష్టం చేశారు. బొల్లారంలోని హాస్పిటల్ నిర్మాణం ఫనులను,ఇంజనీర్లు అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. పనులు శరవేగంగా పూర్తి చేయాలని అధికారులకు దేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యత పరంగా ఎలాంటి లోపాలు లేకుండా నిర్మాణం చేపట్టాలని ఇంజనీర్లకు సూచించారు. వీలైనంత తొందరగా ఆస్పత్రి నిర్మాణం చేయాలని,ఎక్కడ చిన్నపాటి లోపం లేకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రికి సంబంధించిన ఎన్ని బ్లాకులు ఏ బ్లాక్ ఎక్కడ ఉంటాయని అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుంది, ప్రజల ఆరోగ్యం కోసం పెద్ద ఎత్తున బడ్జెట్ కేటాయిస్తుంది అని అన్నారు. ఇప్పటివరకు సరైన సమయంలో పనులు పూర్తి చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. మరో వైపు వచ్చే సంవత్సరం సెప్టెంబర్ వరకు హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేస్తామని అధికారులు, ఇంజనీర్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకుని కార్పొరేటర్ స్థాయికి మించి వైద్యం అందించడానికి టిమ్స్ హాస్పిటల్ సనద్ధమవుతుంది,దేవిధంగా ఈ టీమ్స్ ఆసుపత్రి ద్వారా చుట్టుపక్కల ఉన్న రెండు మూడు జిల్లాల పేద ప్రజలకు వైద్యం అందుతుంది సంతోషము వ్యక్తం చేశారు. వెయ్యి నుండి 1200 వందల పడుకలకు ఆసుపత్రి నిర్మాణం జరుగుతుంది, ప్రజలకు మరింత సదుపాయంగా ఉండే ఉద్దేశంతోనే ఆసుపత్రిని 1400 పడకలకు పెంచే విధంగా మన ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గదృష్టికి తీసుకెళ్లి,ప్రభుత్వం నుండి నిధులు మంజూరు అయ్యేలాగా నా వంతు కృషి చేస్తానని కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్ హామీ ఇచ్చారు...ఈ కార్యక్రమంలో నిర్మాణ ఇంజనీరులు, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## పిర్జాదిగూడ మేయర్ పీఠంపై గురిపెట్టిన కాంగ్రెస్

- **డిప్యూటీ మేయర్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ల గోవా క్యాంప్**




**మేడిపల్లి,విశాలభారతి:**మేడ్చల్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నాటి నుంచి బిఆర్ఎస్ పార్టీకి వరుస ఎదురు దెబ్బలు తలుగుతూనే ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ లో ఉన్న మూడు కార్పొరేషన్ లో ఇప్పటికే జవహర్ నగర్. బోడుప్పల్ కార్పొరేషన్ లను కైవాసం చేసుకోగా ఉన్న ఒక్క పిర్జాదిగుడా కార్పొరేషన్ సైతం తన ఖాతాలో వేసుకుంటే క్లీన్ స్వీప్ చేసినట్లు అవుతుందని ముగ్గురు కార్పొరేటర్ లను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారని విశ్వసనీయ సమాచారం.

మరోవైపు పార్టీ మారుతున్న కార్పొరేటర్ లను మాజీ మంత్రి. ఎమ్మెల్యే మల్లారెడ్డి. వారిని అడ్డుకోలేక పోయారు. ఈ వ్యవహారంలోనే మంగళవారం నాడు జరిగిన పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ మీటింగ్ లో రసభస చోటు చేసుకుంది తమ పార్టీకి చెందిన కార్పొరేటర్ లను కిడ్నాప్ చేశారని బలవంతంగా బెదిరింపులకు పాల్పడి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్నారంటూ బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు. పీర్జాదిగూడ కార్పొరేషన్ లో తాజాగా 15 మంది బిఆర్ఎస్ కార్పొరేటర్లు తిరుగుబాటు బావుట ఎగురవేశారు. డిప్యూటీ మేయర్ శివకుమార్ ఆధ్వర్యంలో వారంతా గోవా క్యాంప్ నకు వెళ్లడంతో కార్పొరేషన్ అతి త్వరలోనే కాంగ్రెస్ వశం కానున్నట్లు ప్రచారం సాగుతుంది. కార్పొరేషన్ లో మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా దీనిలో 15 మంది డిప్యూటీ మేయర్ శివకుమార్తో గోవాకు తరలి వెళ్లారు. ఎమ్మెల్యేలు పార్టీలు మారుతున్న వేళ కార్పొరేటర్లు సైతం తామెంత అనుకుంటూ బిఆర్ఎస్ పార్టీ నీ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఇదే జరిగితే రాజకీయపరంగా మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కి ఎదురు దెబ్బ తగిలినట్లే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు



## జోనల్ కమిషనర్ కు శుభాకాంక్షలు తెలిపిన నాగరాజు

**కూకట్ పల్లి,విశాల భారతి:**ఇటీవల కూకట్ పల్లి జోనల్ కమీషనర్ గా పదవీ భాధ్యతలు చేపట్టిన ఐఏఎస్ ఆఫీసర్ అపూర్వ్ చౌహాన్ ని టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి,అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంగం గ్రేటర్ అధ్యక్షులు కర్కనాగరాజు ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పూల భోకేతో శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లేబర్ సెల్ కాంగ్రెస్ నాయకులు సప్పిడి భాస్కర్, మున్నా, ఖైరుద్దీన్, యూత్ కాంగ్రెస్ నాయకులు సప్పిడి వినీత్,అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంగం గ్రేటర్ కార్యదర్శులు ,కర్క మహేష్, రమేశ్ పాటిల్, భరత్,జక్కుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## ఓయూలో జియో మాగ్నెటిక్ సర్వే

**సికింద్రాబాద్ ,విశాలభారతి:**ఓయూలోని జియో ఫిజిక్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో డ్రోన్ మాగ్నెటిక్ సర్వే విజయవంతంగా ముగిసింది. జియో ఫిజిక్స్ రంగంలో అత్యాధునిక పరికరాలు, సమర్థత కలిగిన 'స్టెగర్ జియోసైన్స్ అండ్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో సర్వే జరిగింది. సర్వేలో జియో ఫిజిక్స్ పీజీ విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు. పరిశోధన రంగంలో అందుబాటులో ఉన్న అత్యాధునిక పరిజ్ఞానం గురించి తెలుసుకున్నారు. 'స్టెగర్ జియోసైన్స్ అండ్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థతో ఓయూకు మధ్య ఎంవోయూ ఉంది. ఒప్పందంలో భాగంగా ఓయూ అధికారులు విద్యార్థుల కోసం జియో సర్వే నిర్వహించాలని ఆహ్వానించారు. ఈ మేరకు అంగీకరించిన స్టైగర్స్ సంస్థ ప్రతినిధులు జియో ఫిజిక్స్ డిపార్ట్మెంట్ ఓయూ యూసీఎస్ ప్రిన్సిపాల్, జియో ఫిజిక్స్ డిపార్ట్మెంట్ హెడ్ ప్రొ.బోయిళ్ళ . వీరయ్య పర్యవేక్షణలో డ్రోన్ మాగ్నెటిక్ సర్వే కార్యక్రమం నిర్వహించారు. జియో ఫిజిక్స్ డిపార్ట్మెంట్ ఎదురుగా సర్వే కార్యక్రమన్ని నిర్వహించారు. జియో ఫిజిక్స్, ఎర్త్ సైన్స్, పరిశోధన విద్యార్థులకు పరిజ్ఞానం పెంచేందుకు ఈ సర్వే ఎంతగానో దోహదపడుతుందని ప్రొ. బి.వీరయ్య తెలిపారు. పీజీ విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, ఫ్యాకల్టీ సభ్యులు ఈ సర్వేలో పాల్గొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో డ్రోన్ ఎగరవేసేందుకు అనుమతి ఇచ్చిన ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. బి.లక్ష్మీనారాయణకు జియో ఫిజిక్స్ డిపార్ట్మెంట్ కు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో పీజీ, పీహెచ్డీ , విద్యార్థులు ,ప్రొపెసర్స్ , ఉద్యోగులు పాల్గొన్నారు.



## విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు వాణిజ్య విభాగం 2024

**సికింద్రాబాద్, విశాలభారతి:**ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణ రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలోని కామర్స్ పీజీ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయ వాణిజ్య శాస్త్ర విభాగం అద్భుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల పరిధిలోని ఎం.కామ్ విద్యార్థులు వివిధ అంశాల్లో తమ ప్రతిభను, నైపుణ్యాన్ని చాటుకునేందుకు వీలుగా కామర్స్ డిపార్ట్మెంట్ 'వాణిజ్య 2024' పేరుతో తెలంగాణ కామర్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ మీట్ నిర్వహించేందుకు సిద్ధమైంది. అంతర్ విశ్వవిద్యాలయ స్థాయిలో ఈ నెల 19, 20 తేదీల్లో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. పి.లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. రాష్ట్రంలోని ఉత్సాహవంతులైన ఎం.కామ్ విద్యార్థుల్లో దాగి ఉన్న వాణిజ్య రంగ మెలకువలు, ప్రతిభను చాటుకునేందుకు ఈ పోటీలు వేదికగా నిలుస్తాయని తెలిపారు. ఆరోగ్యకరమైన పోటీ, స్నేహపూర్వక వాతావరణంలో విద్యార్థులు తమ సత్తా చాటేందుకు వీలుగా వాణిజ్య 2024 సం.లో వివిధ రకాల ఈవెంట్స్ ఉంటాయని చెప్పారు. పోటీలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకునేందుకు, సందేహాలు నివృత్తి చేసుకునేందుకు విద్యార్థులు dcouvanijya2024@gmail.com.కు మెయిల్ చేసి తెలుసుకోవచ్చని సూచించారు. ఓయూ కామర్స్ డిపార్ట్మెంట్ లో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఓయూ వీసీ ఓఎస్డీ ప్రొ. బి.రెడ్యా నాయక్, కామర్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొ. ఎం.గంగధర్, హెడ్ ప్రొ.దాసరి. చెన్నప్ప, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ ప్రొ. కృష్ణ చైతన్య, ప్రోగ్రామ్ కన్వీనర్ ప్రొ. ఐ.శేఖర్, ఫ్యాకల్టీ సైన్సెస్ డీన్ ప్రొ. కరుణ సాగర్, ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొ. తలత్ సుల్తానా, మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ వెంకటయ్య, ప్రొ. జి.నరేశ్ రెడ్డి, ప్రొ. ఎ.పాట్రిక్, డాక్టర్ రామేశ్వర్ పాల్గొన్నారు.

## పాలస్తీనా ప్రజలపై దాడులను తక్షణమే ఆపాలి

- **సామ్రాజ్యవాదం నశించాలి.**
- **ప్రొపెసర్స్ కాశిం, గడ్డం లక్ష్మణ్**



**సికింద్రాబాద్, విశాలభారతి :**మానవత్వాన్ని కాపాడుకుందాం,పాలస్తీనా ప్రజలపై జరుగుతున్న దాడులను తక్షణమే ఆపాలని, సామ్రాజ్యవాద యుద్ధాన్ని వ్యతిరేకిద్దాం అనే అంశం పై బుధవారం ఓయూ పరిశోధకులు, విద్యార్థులు పొలిటికల్ సైన్స్ సెమినార్ హాల్ లో సమావేశం నిర్వహించారు. ఆజాద్ సభాధ్యక్షత వహించగా కాశీం,తెలుగు శాఖ మాజీ హెడ్ ప్రొ. కాశిం , పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ ప్రొ. గడ్డం లక్ష్మణ్ లు పాల్గొన్నారు. ప్రొ. కాశీం మాట్లాడుతూ. పాలస్తీనా గత 100 సంవత్సరాలుగా అణచివేత కు గురి అవుతూనే ఉంది. మొదటి ప్రపంచ యుద్ధం లో బ్రిటన్ ఆ, తర్వాత అమెరికా ఈరోజు ఈ మానవ హననానికి కారణం అన్నారు.అమెరికా చేతిలో ఐక్యరాజ్య సమితి కీలు బొమ్మ అయిందని అన్నారు.అమెరికా ఆయుధ వ్యాపారం మరియు చమురు దోపిడీ కోసం ఈ యుద్ధాన్ని పెంచిపోషించదని అన్నారు. పాలస్తీనా మారణహోమంకు వ్యతిరేకంగా ప్రపంచ దేశాలలోని ప్రజాస్వామిక వాదులు విద్యార్థులు ఏకమై పోరాడుతున్నారు అన్నారు. పాలస్తీనా ఎప్పటికి పాలస్తీనా ప్రజలదే అన్నారు.ప్రొ. గడ్డం లక్ష్మణ్ (రిటైర్డ్),పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ. పాలస్తీనా ప్రజల హక్కులు కాలరాయబడుతున్నాయి అన్నారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను ఉల్లంఘించి బెంజమిన్ నేతన్యాహు రక్త పాతాన్ని కొనసాగిస్తున్నారు అన్నారు. 17000 ల మంది చిన్న పిల్లలు ,40000 వేల మంది ప్రజలు ఇజ్రాయెల్ దాడుల్లో చనిపోయారు అన్నారు. అనేక మంది క్షతగాత్రులయ్యారు.యుద్ధం పర్యావరణాన్ని విధ్వంసం చేస్తుంది, మానవజాతిని నాశనం చేస్తుంది. ఈ యుద్ధాల వెనుక సామ్రాజ్య వాద అమెరికా ఉందన్నారు.ప్రపంచ ప్రజలు ఏకమై యుద్ధం లేని సమాజం కోసం పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు అఖిల్, యాదగిరి, సత్య, పరమేష్,శ్రవణ్, గణేష్,విద్యార్థులు పాల్గొన్నారు.



## వైభవంగా డాక్టర్ ముజీబ్ జన్మదిన వేడుకలు

- **డాక్టర్ ఎస్ ఎం హుసేని ముజీబ్ 52వ జన్మదిన వేడుకలు**
- **టీఎన్జీ యూనియన్ కేంద్ర సంఘం**

**హైదరాబాద్, విశాలభారతి:**టీఎన్జీ యూనియన్ కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం హుసేని ముజీబ్ 52వ జన్మదిన వేడుకలు సంఘ కార్యాలయంలో అధ్యక్షులు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యం.ఎన్.జ. క్యాన్సర్ ఆసుపత్రిలో అమ్మవారి ఆలయంలో పూజలు చేసి, హజరత్ యూసుఫ్ బాబా దర్గాలో చాదర్ సమర్పించి పేదలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం డాన్ బాస్కో అనాధ శరణాలయంలో దైవ ప్రార్థన తర్వాత భోజనం ఏర్పాటుతో పాటు ఒక నెలసరికులు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు కేఆర్ రాజ్ కుమార్, బాల్ రాజ్, ఉమర్ ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, నరేష్ కుమార్, ఖలీద్ అహ్మద్, వైదీక్ శాస్త్ర, శ్రీధర్ శ్రీమతి సుజాత శ్రీమతి గీత, మాజీ కార్యదర్శి జి.ప్రభాకర్ మాజీ సభ్యులు శ్రీమతి జానకి, కేంద్ర సంఘ నాయకులు పర్వతాలు, కొండల్ రెడ్డి, జిల్లా పిఆర్ఓ సయ్యద్ జాంగిర్ మొహమ్మద్ వహీద్ మహమ్మద్ ముస్తఫా షరీఫ్, మిత్రులు ఉస్మాని అలీ ఉస్మాని, రామకృష్ణారెడ్డి, సుమారు 58 యూనిట్స్ అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



# 'మిస్టర్ బచ్చన్' నుంచి ఫస్ట్ సింగిల్

డైరెక్టర్ హరీష్ శంకర్ కు మ్యూజిక్ లో మంచి టేస్ట్ వుంది, ఆయన సినిమాలు థియేటర్లలో విడుదలకు ముందే మ్యూజికల్ గా హిట్ అయ్యాయి. మాస్ మహారాజా రవితేజతో ప్రస్తుతం హరీష్ శంకర్ చేస్తున్న 'మిస్టర్ బచ్చన్' కూడా డిఫరెంట్ జానర్లతో కూడిన ఆల్బమ్. ప్రోమోతో ఆదరగొట్టిన తర్వాత, మేకర్స్ ఫస్ట్ సింగిల్ సితార్ లిరికల్ వీడియోని రిలీజ్ చేశారు. సుబ్రమణ్యం ఫర్ సేల్, గద్దలకొండ గణేష్ తర్వాత మిక్కీ జె మేయర్ మళ్లీ హరీష్ శంకర్ తో జతకట్టారు. ఈ పాట సితార్ సౌండ్స్ తో ప్రారంభమవుతుంది, ఇది మ్యాజిక్ బీట్ లతో కూడిన కంప్లీట్ క్లాసికల్ నెంబర్. కెవ్వు కేక, అస్మైక యోగ అనే రెండు చార్ట్ బస్టర్ల తర్వాత, హరీష్, లిరిక్ రైటర్ సాహితీ రీయూనిట్ లో వచ్చిన ఈ పాట మెస్మరైజింగ్ లిరిక్స్ తో ఆకట్టుకుంది. ట్రాక్ కి అందించిన పదాలు జెమ్స్, సాకేత్ కొమండూరి, సమీర భరద్వాజ్ వోకల్స్ అద్భుతంగా వున్నాయి. అలాగే, చారులత మణి క్లాసిక్ రాగం ట్రూలీ క్లాసికల్. బ్యాక్ పాకెట్, హిప్ మూవ్ లు ఎలిగెంట్ గా వున్నాయి. రవితేజ స్టైలిష్ ఎటైర్ లో యంగ్ అండ్ డాషింగ్ గా కనిపించారు. భాగ్యశ్రీ బోర్స్ గ్లామరస్ దివాలా ఆకట్టుకుంది. వీరిద్దరూ ఆకట్టుకునే కెమిస్ట్రీని పంచుకున్నారు. రవితేజ డ్యాన్స్ మూమెంట్స్ ఎక్స్ లెంట్ గా వుండగా భాగ్యశ్రీ తన ఎలిగెంట్ మూమెంట్స్ తో మెస్మరైజ్ చేసింది. శేఖర్ మాస్టర్ తన అద్భుతమైన కొరియోగ్రఫీతో విజువల్స్ కి మరింత ఎలిగెన్స్ తీసుకొచ్చారు.

# మేడం 50లోనూ 20 అందం

బాలీవుడ్ ప్రేక్షకులతో పాటు సౌత్ ప్రేక్షకులకు సుపరిచితురాలు అయిన ముద్దుగుమ్మ మలైకా అరోరా. ఇటీవల తన 50వ ఏట అడుగు పెట్టిన మలైకా అరోరా అందాల ఆరబోత విషయంలో ఇంకా పాతికేళ్ల పడుచు అమ్మాయి మాదిరిగానే ఉంది. తాజాగా ఈమె షేర్ చేసిన ఫోటోలు కన్నుల విందుగా ఉన్నాయంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. యంగ్ హీరోయిన్స్ కి సైతం నప్పని అందాల సిల్వర్ డిజైనర్ డ్రెస్ లో మలైకా అరోరా సూపర్ గా ఉందంటూ నెటిజన్స్ తో ప్రశంసలు దక్కించుకుంది. ఈ స్థాయిలో అందాల ఆరబోత చూస్తూ ఉంటే మలైకా ఇంకా 20 నుంచి 30 మధ్య వయసులోనే ఉండి పోయిందా అనే అనుమానాలు కలుగుతున్నాయి అంటున్నారు. హీరోయిన్ గా ఈమె చేసిన సినిమాలు తక్కువే అయినా కూడా ఐటెం సాంగ్స్ తో పాటు సోషల్ మీడియాలో ఈమె షేర్ చేసే ఫోటోలు మరియు వీడియోలు, వివాదాల కారణంగా ఎప్పుడూ వార్తల్లో ఉంటుంది. తాజాగా ఈ ఫోటోల కారణంగా మలైకా అరోరా వార్తల్లో నిలిచింది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఈ సిల్వర్ డిజైన్ డ్రెస్ పిక్స్ వైరల్ అవుతున్నాయి. ఇంత అందంగా ఉన్న మలైకా అరోరా సీనియర్ హీరోలకు సరిజోడీ గా ఉంటుంది. కానీ ఆమె మాత్రం ప్రస్తుతానికి నటనపై ఆసక్తి చూపించడం లేదు అనే వార్తలు వస్తున్నాయి. సోషల్ మీడియాలో మాత్రం ఇలాంటి ఫోటో షూట్స్ తో కుర్రకారుకు చెమటలు పట్టిస్తుంది. 50 ఏళ్ల వయసులో 20 ఏళ్ల అందం అన్నట్లుగా కన్నుల విందు చేస్తుంది. ఆకట్టుకునే ఈ అమ్మడి అందం మరో పదేళ్లు అయినా ఇలాగే ఉంటుందనే అభిప్రాయం ను ఫ్యాన్స్ వ్యక్తం చేస్తున్నారు.





# 'కన్నప్ప'.. తిన్నడు విల్లు విశేషాలు

డైనమిక్ స్టార్ విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' మీదున్న అంచనాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. కన్నప్ప టీజర్ అన్ని వర్గాల ఆడియెన్స్ ను ఆకట్టుకుంది. ఇక తాజాగా విష్ణు తన కన్నప్ప సినిమాలో భాగంగా వాడిన విల్లు విశిష్టతను గురించి చెప్పుకొచ్చారు. 'కన్నప్ప'లో తిన్నడు వాడిన విల్లు కేవలం ఆయుధం మాత్రమే కాదు. ఆ ధనస్సు ధైర్యానికి సూచిక. తండ్రీకొడుకుల మధ్య బంధానికి సూచికగా నిలుస్తుంది. కన్నప్ప తండ్రి నాధనాథ తన చేతుల్తో తయారు చేసిన ఆ విల్లు కుటుంబ వారసత్వంగా మారింది. ఆ విల్లుతో కన్నప్ప యుద్ధభూమిలో అసమానమైన బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శిస్తారు. కేవలం ఐదేళ్ల వయసున్న కన్నప్ప అనే యువకుడు ఓసారి అడవిలో క్రూరమైన పులిని ఎదుర్కొంటాడు. ఒక సాధారణ కర్రతో పోరాటం చేసి ఆ పులి నుంచి తప్పించుకుంటాడు. అంత చిన్న వయసులో తన కొడుకు ధైర్య సాహసాల్ని చూసి నాధనాథుడు మురిసిపోతాడు. కన్నప్ప శౌర్యానికి ప్రతీకగా ప్రత్యేకమైన విల్లును తయారు చేస్తాడు. ఆ పులి ఎముకలు, దంతాలతో చేసిన ఆ విల్లు బలానికి, ధైర్య సాహసాలకి ప్రతీకగా నిలుస్తుంది. ఆ విల్లుని రెండుగా విరిస్తే యుద్ధంలో పోరాడేందుకు కత్తుల్లానూ ఉపయోగపడేలా రూపొందించారు.విష్ణు చెప్పిన కథను శ్రద్ధగా విన్న న్యూజిలాండ్ లోని చిత్ర కళా దర్శకుడు క్రిస్ ప్రత్యేకమైన విల్లుని తయారు చేశారు. కన్నప్ప సినిమా విజన్ కు అనుగుణంగా, విష్ణు మంచు అంచనాలకు తగ్గట్టుగా ఆ ధనస్సుని రూపొందించాడు. ఈ విల్లుతోనే న్యూజిలాండ్ లో రెండు నెలల పాటు చిత్రీకరించారు. విష్ణు మంచు మాట్లాడుతూ.. 'ఈ తిన్నడు విల్లు కన్నప్పలో అంతర్భాగం అయింది. అతను దాన్ని అచంచలమైన గర్వంతో ఉపయోగిస్తూ.. తన తెగను, అడవిలో సమతుల్యతను కాపాడుకుంటాడు. ఈ కథ యువతలో ధైర్యాన్ని నింపుతుంది, విన్న వారందరిలో ఆశ్చర్యాన్ని రేకెత్తిస్తుంది. మేము అనుకున్నదాన్ని అనుకున్నట్టుగా రూపొందించినందుకు సంతోషంగా ఉంది' అని అన్నారు.

# 'ఆల్ఫా' షూటింగ్‌లో ఆలియాభట్

బాలీవుడ్ లేడీ సూపర్‌స్టార్ ఆలియాభట్ యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ ఫిల్మ్ 'ఆల్ఫా'కోసం షూటింగ్ మొదలుపెట్టారు. అత్యంత భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది ఆల్ఫా సినిమా. యష్‌రాజ్ ఫిల్మ్స్ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న స్పై యూనివర్స్ మూవీ 'ఆల్ఫా'. ఇటీవల గ్రాండ్‌గా అనౌన్స్ అయిన ఈ సినిమా సెట్స్ కి హాజరయ్యారు నటి ఆలియా భట్. ఇప్పుడు వైరల్ అవుతున్నది 'ఆల్ఫా'లో ఆలియా అసలైన లుక్ కాదు. సినిమాలో ఆమె లుక్ ఎవరి ఊహలకూ అందనంత గొప్పగా ఉంటుంది. ఆమె సెట్స్ లోకి ఎంటర్ అవుతున్నప్పుడు క్లిక్‌మనిపించిన లుక్కే వైరల్ అవుతోంది. అసలు ఆల్ఫా సెట్స్ నుంచి లుక్ లీక్ అయ్యే ఛాన్సే లేదు. సెట్‌కి అంతగా భద్రతను కల్పించింది యూనిట్. ఫస్ట్ ఫీమేల్ లీడ్ యష్‌రాజ్ స్పై యూనివర్స్‌గా తెరకెక్కుతోంది 'ఆల్ఫా'. ఇందులో ఆలియా సూపర్ ఏజెంట్‌గా నటిస్తారు. శివ రవైల్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. యష్‌రాజ్ ఫిల్మ్స్ లో ఇంతకు ముందు ప్రపంచ ప్రఖ్యాత ప్రాజెక్ట్ 'ది రైల్వే మెన్' కు డైరక్ట్ చేసిన ఘనత శివ రవైల్‌ది. భోపాల్ గ్యాస్ ట్రాజెడీ ఆధారంగా తెరకెక్కిన ఆ ప్రాజెక్ట్ గురించి ఇప్పటికీ మాట్లాడుకుంటుంటారు ఆడియన్స్. యష్‌రాజ్ స్పై వర్స్ గురించి చెప్పుకోవాలంటే ఏక్ థా టైగర్, టైగర్ జిందా హై, వార్, పఠాన్, టైగర్3 సినిమాలను ప్రస్తావించకుండా ఉండలేం. ప్రేక్షకుల్లో అత్యంత భారీ విజయాన్ని అందుకున్న సినిమాలవి. ఈ చరిష్మాతోనే ప్రస్తుతం 'ఆల్ఫా'ను కాన్ఫిడెంట్‌గా తెరకెక్కిస్తున్నారు మేకర్స్. ప్రస్తుతం యష్‌రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో వార్2 తెరకెక్కుతోంది. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ నటిస్తున్న ఈ సినిమా మీద అంచనాలు అత్యంత భారీగా ఉన్నాయి.



# "ఆపరేషన్ రావణ్" ట్రైలర్ లాంఛ్



రక్షిత్ అట్లూరి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "ఆపరేషన్ రావణ్". ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మాణంలో న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్ గా దర్శకుడు వెంకట సత్య రూపొందిస్తున్నారు. సంగీర్తన విపిన్ హీరోయిన్ గా నటిస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న "ఆపరేషన్ రావణ్" సినిమా ఆగస్టు 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ వస్తోంది. ఈ రోజు ఈ సినిమా ట్రైలర్ లాంఛ్ కార్యక్రమాన్ని హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వెంకట సత్య మాట్లాడుతూ - మా "ఆపరేషన్ రావణ్" ట్రైలర్ లాంఛ్ కు హీరో విశ్వక్ గారు రావడం సంతోషంగా ఉంది. ఆయన చిన్నవాడు కాబట్టి పాదాభివందనం చేయడం లేదు. ఈ సినిమాకు నేనే ఎందుకు డైరెక్షన్ చేశాను అనేది చెబుతాను. నీకు ఈ సినిమాలు చేయడం అవసరమా అనేవారూ ఉంటారు. నేను ఇప్పటిదాకా మీరు ఏ సినిమాలోనూ చూడని అంశాలు "ఆపరేషన్ రావణ్" చిత్రంలో చూపించబోతున్నా. అవి తెలంగాణ, ఆంధ్రాలో, అమెరికాలో మీరు ఎప్పడూ చూడలేదు. రాజమౌళి గారు కూడా ఇలాంటి అంశాన్ని తెరపై చూపించలేదు. అదే మీ ఆలోచనలు. మీ ఆలోచనల ప్రభావం వల్లే మీరు మంచి వాళ్లా చెడ్డ వాళ్లా అనేది నిర్ణయించడం జరుగుతుంది. మీ ఆలోచనలే మీరు ఎలా ఉండాలే డిసైడ్ చేస్తాయి. ఆ పాయింట్ తో "ఆపరేషన్ రావణ్" సినిమాను రూపొందించాను. ఫస్ట్ టైమ్ మీ ఆలోచనలను విజువల్ గా తెరపై చూపించబోతున్నా. మా అబ్బాయిని డైరెక్ట్ చేస్తున్నా అనే విషయం నన్ను పెద్దగా ప్రభావితం చేయలేదు. నేను డైరెక్టర్ ను కాబట్టి నా జాబ్, నేను చెప్పాలనుకున్న కథ మీదే ఫోకస్ చేశాను. రక్షిత్ బాగా నటించాడు. మనలో రెండు రకాల ఆలోచనలు ఉంటాయి. మంచివీ చెడ్డవి. చెడ్డవాటిని మంచివి డామినేట్ చేస్తే మంచోళ్లుగా ఉంటాం. మంచి ఆలోచనలను చెడ్డ ఆలోచనలు డామినేట్ చేస్తే చెడ్డవాళ్లుగా మారుతాము. మంచి ఆలోచనలు ఉన్న రాముడు దేవుడు అయితే చెడు ఆలోచనలతో రావణుడు రాక్షసుడిగా వధించబడ్డాడు. నేను దర్శకుడిగా ఈ సినిమా రూపొందించి మంచి ఆలోచన చేశానా లేదా అనేది ఆగస్టు 2న ప్రేక్షకులు ఇచ్చే ఫలితంతో తెలుస్తుంది. మా మూవీలో రాధిక గారు కీలక పాత్ర పోషించారు. ఓటీటీలో చాలా సైకో థ్రిల్లర్స్ వస్తున్నాయి. వాటికి పూర్తి భిన్నంగా మా మూవీ ఉంటుంది. అన్నారు.


# ఆసక్తి కలిగిస్తున్న "పొలిమేర 3" అనౌన్స్ మెంట్ వీడియో

టాలీవుడ్ సక్సెస్ ఫుల్ హారర్ థ్రిల్లర్ "పొలిమేర 3" అనౌన్స్ మెంట్ వచ్చేసింది. ఈ చిత్రానికి అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించనున్నారు. నిర్మాత భోగేంద్ర గుప్తాతో కలిసి వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి "పొలిమేర 3" నిర్మించనున్నారు. "పొలిమేర 3" అనౌన్స్ మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన వీడియో ఆసక్తి కలిగిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ పూర్తయ్యింది. ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభించబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు.



"పొలిమేర 3" లో సత్యం రాజేష్, బాలాదిత్య, కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రవి వర్మ, రాకేందు మౌళి, చిత్రం శ్రీను, సాహిత్య దాసరి ప్రధాన పాత్రల్లో నటించనున్నారు. లాక్ డౌన్ టైమ్ లో "మా ఊరి పొలిమేర" డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో నేరుగా స్ట్రీమింగ్ అయ్యింది. ఈ సినిమాకు వచ్చిన రెస్పాన్స్ తో సీక్వెల్ "పొలిమేర 2" రూపొందించారు. ఈ సినిమా 2023 నవంబర్ 3న ప్రేక్షకుల ముందుకొచ్చింది. "పొలిమేర 3" సినిమా థియేటర్, ఓటీటీ లో ప్రేక్షకుల రివార్డ్ తో పాటు 'దాదా సాహెబ్ ఫాల్కే ఫిలిం ఫెస్టివల్' లో అవార్డ్స్ దక్కించుకోవడం విశేషం. "పొలిమేర 3" సినిమాపై ప్రేక్షకుల్లో మంచి ఎక్స్ పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి.

# హీరో కిరణ్ అబ్బవరం "క" టైటిల్



యంగ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ రోజు ఈ సినిమాకు "క" అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ అనౌన్స్ చేశారు. టైటిల్ అనౌన్స్ మెంట్ పోస్టర్ లో కిరణ్ అబ్బవరం మేకోవర్ ఆసక్తి కలిగిస్తోంది. ఈ సినిమాను శ్రీచక్రాస్ ఎంటర్ టైన్ మెంట్స్ తో బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మిస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ విలేజ్ బ్యాక్ డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ కథతో రూపొందిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో "క" సినిమాను తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకురాబోతున్నారు. కిరణ్ అబ్బవరం కొంత విరామం తర్వాత చేస్తున్న "క" సినిమా అనౌన్స్ మెంట్ నుంచే క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.